# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue III - Mar 2025



## ప్రార్థన శక్తిని ఎరుగుదువా?

# అసాధ్యాలను సుసాధ్యం చేసే శక్తి

మన జీవితాల్లో అసాధ్యం అనుకునే వాటిని సుసాధ్యం చేసే శక్తి ఏదైనా ఉందంటే అది ప్రార్థన. ఈ విషయాన్ని మనకు ప్రభువు బోధించారు. పట్టుదలతో ప్రార్థన చేయాలనే సందేశాన్ని ఆయన మనకు అందించారు. లూకా సువార్త 18:1లో ఆయన ఈ విధంగా సెలవిచ్చారు, "వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను". అంటే, మనం విసుగు చెందకుండా ఎల్లప్పుడూ ప్రార్థన చేస్తూ ఉండాలి.

ఈ ఉపమానంలో, అన్యాయస్థుడైన న్యాయాధిపతి ఒక విధవరాలి పట్ల కనికరం లేకుండా ఆమెను పట్టించుకోలేదు. అయితే, ఆమె పదే పదే తన సమస్యను చెబుతూ విసిగిస్తూ ఉండడంతో, చివరికి ఆమెకు న్యాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరి నీతిగల న్యాయాధిపతి అయిన దేవుడు, ఆయన ఏర్పరుచుకున్న వారి విషయంలో ఎంతో నిశ్చయముగా న్యాయం చేస్తాడు కదా.

కాబట్టి, మన ప్రభువు చెప్పినట్లు, ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ పట్టుదలతో ప్రార్థించేవారిగా ఉండాలి. ప్రార్థన అంటే దేవునితో ముఖాముఖి మాట్లాడడం, ఆయనతో సహవాసం చేయడం. యేసుక్రీస్తు జీవితంలో మనం ఇదే చూస్తాం. "ఆయన పెందలకడనే లేచి యింకను చాలా చీకటి యుండగానే బయలు దేరి అరణ్య ప్రదేశమునకు వెళ్లి, అక్కడ ప్రార్థన చేయుచుండెను" (మార్కు 1:35). ఆయన తరచుగా ఒంటరిగా ప్రార్థించడానికి వెళ్ళేవారు.

మనం కూడా మన రాష్ట్రం కోసం, దేశం కోసం, మన చుట్టూ ఉన్న ప్రజల కోసం ప్రార్థించాలి. ప్రార్థన ద్వారా అసాధ్యమైన కార్యాలు సుసాధ్యమవుతాయి. ఉదాహరణకు, చైనా దేశంలోని విశ్వాసుల ప్రార్థన ద్వారా ఇప్పుడు చైనాలో గొప్ప ఉజ్జీవం వచ్చింది. ఒకప్పుడు నాస్తిక దేశంగా ఉన్న చైనాలో, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యధికంగా చర్చికి వెళ్ళేవారి సంఖ్యలో వారు మొదట స్థానంలో ఉన్నారు. ఇది ప్రార్థన యొక్క శక్తికి నిదర్శనం.

ప్రార్థించేవారు ఉంటే దేశాలు, ప్రాంతాలు పరివర్తనం చెందుతాయి అనడంలో వాస్తవముంది. ప్రార్థన ద్వారా మనం దేవుని శక్తిని విడుదల చేయగలం, తద్వారా మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చగలం.

మన యూనివర్శిటీల కోసం, కళాశాల విద్యార్థుల రక్షణ కోసం, వారు రక్షింపబడి మంచి శిష్యులుగా తయారవ్వాలని ప్రార్థించాలి. మన విద్యా సంస్థలు దేవుని జ్ఞానంతో నింపబడాలని, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని మనం ప్రార్థించాలి.

జోసఫ్ అభిషేకరావు ప్రార్థన ద్వారా ఎంత గొప్ప కార్యాలు చేశారో మనం చూశాం. వారు ప్రార్థించిన స్థలాలలో, పలు ప్రాంతాలలో ఇప్పటికీ గొప్ప సేవ జరుగుతుంది. ఆయన ఒక గొప్ప ప్రార్థనా వీరుడు, ఆయన ప్రార్థనల ద్వారా అనేక మంది దీవెనలు పొందారు.

ఆంద్రూ ముర్రే చెప్పినట్లు, "దేవుని కోసం లేదా ఇతరుల కోసం మనం చేయగలిగే గొప్ప పని ప్రార్థన" కాబట్టి, మనం కూడా మండే ఉజ్జీవ జ్వాలలు మన రాష్ట్ర విద్యార్థి పరిచర్యను తాకాలని ప్రార్థిద్దాం. అట్టి కృప, పరిశుద్ధాత్మ నడిపింపు దేవుడు మనకు అనుగ్రహించును గాక! దేవుడు మన ప్రార్థనలను ఆల కించి, మన రాష్ట్రంలో గొప్ప కార్యాలు జరిగించును గాక!

– దాసరి రాజేష్

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue III - Mar 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH



**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Simon, Hyderabad
Mrs. P. Raja Kumari, Hyderabad
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. L.Vinodha, Sangareddy



**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com


**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

| | |
|---|---|
| Name | - UESI PUBLICATION TRUST |
| Bank | - Canara Bank |
| A/C No | - **0624101037187** |
| Branch | - East Maredpally, Secunderabad |
| IFSC code | - CNRB0000624 |

Kindly inform the office after depositing amount. Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEME:**

April - The Importance of Scripture

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు

## విషయ సూచిక


| | |
|---|---|
| ప్రార్థన శక్తిని ఎరుగుదువా? | 4 |
| ప్రార్థన – మనలను శక్తివంతం చేసే అస్త్రం | 6 |
| దైవిక సంభాషణ | 10 |
| వారిని ప్రభావితులుగా చేసింది | 15 |
| నీ మౌనధ్యాన సమయం ఎలా ఉంది? | 17 |
| నిష్క్రియాత్మకత వద్దు | 20 |
| దేవుడిచ్చిన సాటియైన సహకారి | 24 |
| ఎస్తేరు | 27 |
| పుస్తకాలు రాయని ప్రపంచ ప్రఖ్యాత రచయిత! | 29 |


## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్ స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

ప్రతి నెల ప్రార్థనాంశాలు 10వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com కు పంపించగలరు.

– విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్



# ప్రార్థన శక్తిని ఎరుగుదువా?

ప్రార్థన అనేది ఒక క్రైస్తవుని ఆధ్యాత్మిక ప్రయాణానికి పునాది వంటిది. ఒక ఇల్లు గట్టి పునాదిపై ఎంత భద్రంగా ఉంటుందో, మన ఆధ్యాత్మిక జీవితం కూడా ప్రార్థన అనే పునాదిపై అంత బలంగా నిలబడుతుంది. ప్రార్థన చేయడం ద్వారా మనిషికి మరియు దేవునికి మధ్య ఒక శక్తివంతమైన అనుబంధం ఏర్పడుతుంది. ఇది మనల్ని దేవునికి మరింత చేరువ చేస్తుంది, ఆయనతో మన సంబంధాన్ని బలపరుస్తుంది.

రక్షణ పొందిన ప్రతి వ్యక్తి యొక్క జీవిత ప్రయాణం ప్రార్థన అనే ఇంధనంతో నడుస్తుంది, తప్పకుండా నడవాలి కూడా! ఒక కారులో ఇంధనం లేకపోతే అది ఎలా ముందుకు వెళ్లలేదో, అదే విధంగా మన విశ్వాస జీవితం కూడా ప్రార్థన లేకుండా ఫలవంతంగా సాగదు. ప్రార్థన మన ఆత్మకు బలాన్నిస్తుంది, మన ఆలోచనల ను సరిచేస్తుంది, మనల్ని సరైన మార్గంలో నడిపిస్తుంది.

### విశ్వాసి జీవితంలో ప్రార్థన లేకపోతే ఏమి జరుగుతుంది?

ఇంధనం లేక ఆగిపోయిన కారును బలవంతంగా ప్రక్కకు లాగుతారు కదా, అదేవిధంగా ప్రార్థన లేని విశ్వాసి జీవితాన్ని కూడా సాతాను తన వైపుకు లాక్కుంటాడు. ప్రార్థన లేకపోవడం వల్ల మన జీవితంలో దేవుని ఉద్దేశాలు నెరవేరవు, మన విశ్వాస జీవితం విచ్ఛిన్నమవుతుంది.

### ప్రార్థన యొక్క ప్రాముఖ్యత

1. **ప్రార్థన శాంతిని ఇస్తుంది (ఫిలిప్పీ 4:6-7):** మన జీవితాల్లో కష్టాలు, సమస్యలు వచ్చినప్పుడు దిగులు చెందకుండా ప్రార్థన చేయాలి. మనం ప్రార్థించినప్పుడు, దేవుడు మనకు తన శాంతిని అనుగ్రహిస్తాడు.
2. **ప్రార్థన స్వస్థతను ఇస్తుంది (యాకోబు 5:16):** నీతిమంతుడు చేసే ప్రార్థన చాలా శక్తివంత మైనది. మనకు లేదా ఇతరులకు అనారోగ్యం కలిగినప్పుడు, స్వస్థత కోసం మనం ప్రార్థించ వచ్చు. ప్రార్థన ద్వారా దేవుడు మనల్ని స్వస్థపరుస్తాడు, మన బాధల ను తొలగిస్తాడు.
3. **ప్రార్థన శత్రువును ఓడిస్తుంది (ఎఫెసీ 6:18):** జీవితంలో మనల్ని అధైర్యపరిచే శక్తులు ఎన్నో ఉంటాయి. వాటిని ఎదుర్కోవడానికి ప్రార్థన ఒక గొప్ప ఆయుధం. నిరంతరం ప్రార్థన చేసే విశ్వాసులను ఇది ప్రోత్సహిస్తుంది.

ప్రార్థన ద్వారా మనం శత్రువుపై విజయం సాధించవచ్చు.

4. **ప్రార్థన తలుపులు తెరుస్తుంది (మత్తయి 7:7):** మనం ఏదైనా అడిగినప్పుడు, వెతికినప్పుడు, తట్టినప్పుడు దేవుడు మనకు జవాబు ఇస్తాడు. అంటే, మనం ప్రార్థన ద్వారా దేవుణ్ణి అడిగి నప్పుడు, ఆయన కొత్త ద్వారాలను తెరుస్తాడు.

ప్రార్థన అనేది విశ్వాసుల జీవితాల్లో దేవుని శక్తిని అనుభవించడానికి ఒక గొప్ప అవకాశం. ఇది ఇతరుల హృదయాలను మారుస్తుంది, మన విశ్వాసాన్ని బలపరుస్తుంది. అంతేకాదు, అద్భుతాలు కూడా జరిగేలా చేస్తుంది.

### విశ్వాసి ఎలా ప్రార్థించాలి?

1. విశ్వాసంతో ప్రార్థించాలి (మార్కు 11:24)
2. నిర్మల హృదయంతో ప్రార్థించాలి (కీర్తనలు 66:18)
3. పట్టుదలతో ప్రార్థించాలి (లూకా 18:1-8)
4. దేవుని చిత్తప్రకారం ప్రార్థించాలి (1 యోహాను 5:14)
5. శోధనలో ప్రవేశించకుండునట్లు మెలుకువగా ఉండి ప్రార్థించాలి (మత్తయి 26:41)

### బైబిల్లోని కొన్ని శక్తివంతమైన ప్రార్థనలు

బైబిల్లో ఎందరో భక్తులు ప్రార్థన ద్వారా అద్భుతమైన ఫలితాలను పొందారు. వారి ప్రార్థనలు మనకు స్ఫూర్తిని కలిగిస్తాయి. అలాంటి కొన్ని శక్తివంతమైన ప్రార్థనల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

1. **హన్నా ప్రార్థన (1 సమూ 1:10-20):** హన్నా పిల్లలు లేని కారణంగా ఎంతో వేదన చెందింది. ఆమె దేవుని మనస్ఫూర్తిగా ప్రార్థించి ఒక కుమారుడిని ప్రసాదించమని అడిగింది. దేవుడు ఆమె ప్రార్థనను ఆలకించి సమూయేలును ప్రసాదించాడు. సమూయేలు ఇశ్రాయేలీయులకు గొప్ప న్యాయాధిపతిగా, ప్రవక్తగా పేరు గాంచాడు. హన్నా చేసిన నిరంతర ప్రార్థన ఆమె కోరికను నెరవేర్చడమే కాకుండా, ఇశ్రాయేలీయులకు ఒక గొప్ప నాయకుడిని అందించింది. మనం కూడా హన్నా వలె పట్టుదలతో ప్రార్థన చేస్తే దేవుడు మన మొర ఆలకిస్తాడు.

2. **ఏలీయా ప్రార్థన (1 రాజులు 18:36-38):** ఏలీయా దేవుని ప్రవక్త. ఇశ్రాయేలీయులు దేవుని విడిచిపెట్టి విగ్రహాలను పూజిస్తున్న సమయంలో, ఏలీయా దేవుని శక్తిని నిరూపించడానికి ఒక సవాలు విసిరాడు. బలిపీఠం మీద అగ్ని దిగి రావాలని ప్రార్థించాడు. వెంటనే ఆకాశం నుండి అగ్ని దిగి బలిని దహించివేసింది. ప్రజలంతా యెహోవానే నిజమైన దేవుడని నమ్మారు. ఏలీయా చేసిన ప్రార్థన దేవుని శక్తిని రుజువు చేసింది. మన జీవితాల్లో కూడా దేవుని శక్తిని చూడాలంటే విశ్వాసంతో ప్రార్థన చేయాలి.

3. **యబ్బేజు చేసిన ప్రార్థన (1 దిన 4:10):** యబ్బేజు తన జీవితంలో దేవుని ఆశీర్వాదం కోసం ప్రార్థించాడు. "నీవు నన్ను నిశ్చయముగా ఆశీర్వదించి, నా సరిహద్దును విశాల పరచుము. నీ చెయ్యి నాకు తోడుగా ఉండును గాక. నాకు కీడు రాకుండా దానిలో నుండి తప్పించుము." అని వేడుకున్నాడు. దేవుడు అతని ప్రార్థన ఆలకించి, అతడు అడిగిన దానికంటే ఎక్కువగా ఇచ్చాడు. మనం కూడా మన జీవితంలో దేవుని ఆశీర్వాదం కోసం యబ్బేజు వలె ప్రార్థించవచ్చు.

### ముగింపు

2 దినవృత్తాంతములు 7:14-16 ప్రకారం, విశ్వాసులమైన మనం తగ్గించుకొని, ప్రార్థన చేసి, ఆయనను వెతికి, చెడు మార్గాలను విడిచిపెడితే, ప్రభువు ఆకాశం నుండి మన ప్రార్థనలను విని మన దేశాన్ని రక్షిస్తాడు, స్వస్థపరుస్తాడు. కాబట్టి, మనం వ్యక్తిగతంగా, సంఘంగా, సమాజంగా మరియు మన దేశం కోసం భారంతో ప్రార్థన చేయాలి.

సాతానును ఎదిరించడానికి ప్రార్థన ఒక శక్తివంతమైన ఆయుధం. యు.ఇ.యస్.ఐ మనకు నేర్పిన టైం (Time), టాలెంట్ (Talent), ట్రెజర్ (Treasure) తో పాటు మరొక 'T' అంటే టీయర్స్ (Tears) ను జత చేసుకుని ప్రార్థించగలిగితే మనం యు.ఇ.యస్.ఐ పరిచర్యలోనూ, సంఘంలోనూ మార్పు చూడగలం.

**- డా॥ సుబ్బారావు,**
**సన్‌సిటీ జోన్, హైదరాబాద్**



# ప్రార్థన

## మనలను శక్తివంతం చేసే అస్త్రం

సౌమ్య తన భర్త దగ్గరకు వెళ్లడానికి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఒకరోజు ఆమె భర్త ఫోన్ చేసి, "రేపు పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం పోలీసులు వస్తారు. వాళ్ళు డబ్బులు అడిగినప్పుడు కాదనకుండా ఇవ్వు. లేకపోతే పని అవ్వదు" అని చెప్పాడు. ఇది విన్న సౌమ్య ఒక క్షణం సందిగ్ధంలో పడింది. లంచం ఇవ్వకుండా పని అవ్వదని ఆమె తండ్రి కూడా చెప్పాడు. పాస్‌పోర్ట్ రాకపోతే భర్త దగ్గరకు వెళ్లడం కష్టం. కానీ లంచం ఇవ్వడం దేవునికి ఇష్టం లేని పని కదా అని ఆలోచిస్తూ ప్రార్థన చేయడం మొదలుపెట్టింది.

"దేవా! ఇది నా చేతుల్లో లేదు. నాకు ధైర్యం కూడా చాలడం లేదు. పోలీసులు లంచం అడగ కుండా సహాయం చెయ్యండి" అని వేడుకుంది. ఆశ్చర్యకరంగా, విచారణకు వచ్చిన పోలీసు అధికారి నిజాయితీగా అన్ని పత్రాలను పరిశీలించి, సంతకాలు తీసుకుని ఎటువంటి డబ్బులు అడగకుండా వెళ్లిపోయాడు.

### ప్రార్థన – దేవునితో నేరుగా సంభాషించే శక్తివంతమైన మార్గం

ప్రార్థన బహు శక్తివంతమైనది. ఇది దేవునితో ఏ అడ్డు తెర లేకుండా నేరుగా మాట్లాడేందుకు, ఆయన చిత్తాన్ని మన జీవితంలో నెరవేర్చమని ప్రార్థించేందుకు ఒక చక్కని మార్గం.

చాలామంది ప్రార్థనను కేవలం నిరాశ, నిస్పృహల నుండి బయటపడటానికి ఒక సాధనంగా చూస్తారు. కానీ నిజమైన ప్రార్థన అనేది "మానవాత్మ పరిశుద్ధాత్మ సహాయంతో దేవుని కృపాసనం వద్దకు వెళ్లడం" అని చార్లెస్ స్పర్జన్ పేర్కొన్నారు.

### ప్రార్థనలో ఉన్న అంతరార్థం

ప్రార్థన అనేది మన మాటల్లోనూ, మౌనంలోనూ వ్యక్తమయ్యే మన ఆత్మలోని బలమైన కోరిక.

* మన పాపాలను అంగీకరిస్తూ దేవుని క్షమాపణ కోరడం
* ఆయన కనికరానికి కృతజ్ఞత చెప్పడం
* క్రీస్తు నామంలో మన అవసరాలను దేవుని ముందుంచి, వాటిని ఆయన చిత్తానికి అనుగుణంగా సమర్పించడం

ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రార్థన అనేది దేవుని చిత్తానికి అనుకూలంగా మనల్ని మనం అప్పగించు కోవడమే.

### ప్రార్థనలో దేవుని సమాధానం

మోకరించి ప్రార్థించే క్రైస్తవుడు దేవునిని మరింత లోతుగా తెలుసుకుంటాడు. అదే సమయంలో, దేవుడు అతన్ని కనుగొంటాడు.

యిర్మీయా 29:12-13లో దేవుడు ఇలా అంటాడు:

"మీ పూర్ణహృదయముతో నన్ను వెదకిన యెడల, నన్ను కనుగొందురు."

ప్రార్థన ద్వారా మన ఆత్మ దేవుని సన్నిధిలో మరింత సానిహిత్యం పొందుతుంది. దేవునితో అనుబంధం బలపడడానికి, ఆయన చిత్తాన్ని తెలుసు కోవడానికి, మనం నిత్యం హృదయపూర్వకంగా ప్రార్థించాలి.

## ప్రార్థనలో రకాలు

మన జీవితాల్లో ప్రార్థన ఒక ముఖ్యమైన భాగం. ఇది దేవునితో మన సంబంధాన్ని బలపరుస్తుంది, మనకు ఓదార్పునిస్తుంది మరియు మన జీవితాలకు ఒక దిశానిర్దేశం చేస్తుంది. ప్రార్థనలో అనేక రకాలు ఉన్నాయి. దేవుని ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఆరాధన, ఆయన చేసిన మేలుకు కృతజ్ఞత, మన తప్పులను ఒప్పుకునేందుకు ఒప్పుకోలు ప్రార్థన, మన అవసరాలను తెలపడానికి విజ్ఞాపన, ఇతరుల కోసం ప్రార్థించేందుకు మధ్యవర్తిత్వ ప్రార్థన. ఈ అన్ని రకాల ప్రార్థనలు మన ఆధ్యాత్మిక జీవితాన్ని బలపరుస్తాయి. ఇప్పుడు వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

### 1. ఆరాధన

దేవుని గుణగణాలను, ఆయన స్వభావాన్ని, శక్తిని, మహత్వాన్ని మనం అర్థం చేసుకున్నప్పుడు, మనలో ఒక విధమైన ఆశ్చర్యం, భక్తిభావం కలుగుతాయి. ఇది ఒక అనిర్వచనీయమైన అనుభూతి మరియు ఆయనను ఆరాధించడానికి మనలను పురికొల్పుతుంది. ఆరాధనలో మనం విన్నపాలు చేయము కానీ ఆయన ఏమై ఉన్నాడో అనగా అయన స్వభావం, శక్తి, మహత్వం, ప్రభావములను బట్టి ఆరాధిస్తాం.

దేవుని హృదయానుసారిగా పిలువబడ్డ దావీదు కీర్తన 104:1-4లో ఆయన దేవుని శక్తిని, సృష్టిని, పవిత్రతను బట్టి ఆరాధించడం మనం చూడవచ్చు. ఆరాధన మనల్ని పరిమితమైన ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, దేవుని సార్వభౌమాధికారం గూర్చిన సత్యంలో మనలను నిలుపుతుంది. నెహెమ్యా 9వ అధ్యాయంలో, నెహెమ్యా దేవుని శక్తిని, కృపను, సంరక్షణను, మార్పులేని ప్రేమను గురించి ఆరాధిస్తాడు.

ఈ రకమైన ఆరాధన మన భావోద్వేగాలు లేదా పరిస్థితులు ఎంత మారినప్పటికీ, దేవుడు శాశ్వతంగా స్థిరంగా ఉన్నాడు అనే సత్యాన్ని పదే పదే మనకు గుర్తుచేస్తుంది. అంతేకాకుండా,

* దేవుడు తన సృష్టిలో ఎంత శక్తివంతంగా, వ్యక్తిగతంగా పనిచేస్తున్నాడో గుర్తు చేసేం దుకు సహాయపడుతుంది.
* పరిస్థితులు మనలను ప్రభావితం చేస్తు న్నప్పుడు వాటి వైపు చూడకుండా దేవుని వైపు చూడడానికి దోహదపడుతుంది.

ఈ ఉరుకుల పరుగుల జీవితంలో, ఆరాధన అంత సులభంగా రాదు. అయితే, దేవుని ఆరాధించడానికి కేటాయించిన క్షణాలే మన ప్రార్థన జీవితంలో శక్తివంత మైన లంగరులుగా మారి, మన దృష్టిని దేవుని ప్రేమ, ఆయన శక్తి, సత్యంపై మన హృదయాన్ని నిలిపేలా చేస్తాయి.

### 2. కృతజ్ఞత

కృతజ్ఞత అనేది దేవుడు మన జీవితంలో చేసిన మేళ్లను గుర్తించి ఆయనను స్తుతించడం. కృతజ్ఞతతో కూడిన స్తుతిని ఒక అలవాటుగా చేసుకున్నప్పుడు, మనం దేవుని కార్యాలను మరింత స్పష్టంగా గ్రహిస్తాం. ఆయన మనకు ఇచ్చిన ఆశీర్వాదాలు, మార్గదర్శకత్వం, కృప అన్నింటినీ మన హృదయంలో అనుభవించ గలుగుతాం.

దానియేలు 2:20-23లో, దానియేలు దేవుడు తనకు కల యొక్క భావాన్ని బయల్పరచినందుకు ఆయనను స్తుతిస్తున్నట్లు మనం చూస్తాం. అతడు తనకు లభించిన జ్ఞానం దేవుని బహుమతిగా అర్థం చేసుకున్నాడు. అంతేకాక, తన ప్రార్థనకు సమాధాన మిచ్చినందుకు మాత్రమే కాక, దేవునికి కృతజ్ఞతలు చెప్పేందుకు కూడా సమయాన్ని కేటాయించాడు. ఇది మనకు గొప్ప మార్గదర్శకం - మనం పొందిన ఆశీర్వాదాలను గుర్తించి, అహంకారానికి లోను కాకుండా, వాటిని దేవుని కృపగా అర్థం చేసుకొని, ఆయనను స్తుతించాలి.

అదేవిధంగా, హన్నా చేసిన స్తుతి మనకు దేవుడు దీనులను ఎలా పైకి లేపుతాడో, అలసిన వారికి ఎలా ఆశను ప్రసాదిస్తాడో చూపిస్తుంది. ఈ ఉదాహరణలు కృతజ్ఞత ఎంత శక్తివంతమైనది, అది మన ఆత్మీయ జీవితాన్ని ఎలా మారుస్తుందో తెలియజేస్తాయి.

మనకు దేవుడు చేసిన ప్రతి మేలు, అది

**ప్రార్థన శక్తివంతమైన సాధనం**

**ఎందుకంటే ఎంతో మంది మిషనరీలు ప్రార్థన చేసినప్పుడు అద్భుతంగా దేవుడు మార్గాలను తెరిచినట్లుగా మనం చూస్తాం.**

చిన్నదైనా, పెద్దదైనా ఆయన కృప వల్లనే మనకు దక్కిందని గుర్తించినప్పుడు, మన మనసులో దేవుని మంచితనాన్ని అర్థం చేసుకునే దృష్టి ఏర్పడుతుంది. కృతజ్ఞత మనల్ని దేవునికి మరింత దగ్గర చేస్తుంది. ప్రతి మంచి వరం పైనుండి వస్తుంది అనే సత్యాన్ని మనం గుర్తించేందుకు ఈ కృతజ్ఞత మనకు సహాయ పడుతుంది.

### 3. ఒప్పుకోలు ప్రార్థన

మన తప్పులను యథార్థంగా దేవుని ముందు ఒప్పుకుని, క్షమించమని అడగడమే ఒప్పుకోలు ప్రార్థన. ఇది ప్రతి విశ్వాసికి ఎంతో అవసరం. ఒప్పుకోలు ప్రార్థన ద్వారా మన జీవితాన్ని లోతుగా పరిశీలించుకునే అవకాశం మనకు లభిస్తుంది. ప్రతి రోజు మౌనధ్యాన సమయంలో మన పొరపాట్లు గ్రహించినప్పుడు, దేవుని సన్నిధిలో మనలను మనం తగ్గించుకొని, హృదయపూర్వకంగా క్షమాపణ అడగగలుగుతాం.

మన బలహీనతలను అంగీకరించినప్పుడు, పాపాన్ని జయించడానికి దేవుని కృప ఎంత అవసరమో మనం అర్థం చేసుకుంటాం. తప్పులు చేసినందుకు మనలో మనం కుమిలిపోవటం కాదు కానీ దేవుడు క్షమించే హృదయం కల వాడు, మనలను అపరిమితంగా ప్రేమించేవాడు అనే సత్యాన్ని గుర్తించినప్పుడు మన హృదయం కృతజ్ఞతతో నిండిపోతుంది.

దేవుని క్షమాపణ మన నీతి మీద ఆధారపడదు. అది ఆయన కృప, మార్పులేని ప్రేమ వల్ల మాత్రమేనని మనం అర్థం చేసుకుంటాం. మనం పవిత్రపరచబడడానికి, పాపంలో మరల పడిపోకుండా ఉండడానికి, ఒప్పుకోలు ప్రార్థన ఎంతో అవసరం.

మన పాపాలను మనం యథార్థ హృదయంతో ఒప్పుకున్నప్పుడు, దేవుడు నమ్మదగినవాడిగా, నీతిమంతుడిగా, ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేస్తాడు (1యోహాను 1:9).

### 4. విజ్ఞాపన ప్రార్థన

మన అవసరాలు, కోరికలు, వాంఛలను దేవుని ముందు మనస్ఫూర్తిగా తెలియజేసే ప్రార్థనే విజ్ఞాపన ప్రార్థన. ఇది మన జీవితంలోని ప్రతి విషయంలో దేవుని జోక్యాన్ని కోరే వినయపూర్వకమైన ప్రార్థన. ఆరోగ్యం, ఆర్థిక అవసరాలు, జ్ఞానం, వివేచన, పిల్లల భవిష్యత్తు – ఈ అన్నిటిలోనూ మన మీద మనం ఆధారపడకుండా, దేవుని మీద పూర్తిగా ఆధార పడేందుకు విజ్ఞాపన ప్రార్థన సహాయపడుతుంది.

ప్రార్థన శక్తివంతమైన సాధనం, ఎందుకంటే ఎంతో మంది మిషనరీలు ప్రార్థన చేసినప్పుడు అద్భుతంగా దేవుడు మార్గాలను తెరిచినట్లుగా మనం చూస్తాం. ఫిలిప్పీ 4:6,7 ప్రకారం, మన విన్నపాలను కృతజ్ఞతా భావంతో దేవుని ముందు ఉంచినప్పుడు, మన చింతలు తగ్గిపోతాయి, దేవునిపై మన విశ్వాసం మరింత బలపడు తుంది.

మనకు శ్రమలు, శోధనలు ఎదురైనప్పుడు, వాటిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి దేవుని సహాయం అడిగినప్పుడే వస్తుంది. మన కోరికలను దాపరికం లేకుండా దేవుని ఎదుట ఉంచినప్పుడు, అవి దేవుని చిత్తానుసారం ఉంటే, ఆయన వాటిని దయచేసే దేవుడు (యోహాను 15).

యేసు ప్రభువు కూడా గెత్సమనే తోటలో తీవ్ర బాధలో ప్రార్థించిన విషయం మనం బైబిల్లో చూస్తాము. ఆయన తండ్రితో జరిపిన ఆ ప్రార్థన ద్వారా విజ్ఞాపన ప్రార్థన మన విశ్వాసాన్ని బలపరచి, దేవునితో మనకున్న సంబంధాన్ని మరింత దగ్గర చేయగలదని అర్థం చేసుకోవచ్చు.

### 5. మధ్యవర్తిత్వ ప్రార్థన

జీవిత ప్రయాణంలో మనకు ఎన్నో అవసరాలు ఉంటాయి. వాటి కోసం దేవుడిని ప్రార్థిస్తాం. అయితే మన వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా ఇతరుల కోసం కూడా

ప్రార్థించడం చాలా ముఖ్యం. ఇతరుల కోసం ప్రార్థించడం మనం చూపే ప్రేమను, విలువను, సత్సంబంధాలను వెల్లడిస్తుంది. యేసు ప్రభువు తనను సిలువ వేసినవారి క్షమాపణ కొరకు తండ్రిని వేడుకున్నట్లుగా, మనం కూడా అనేకమందికి దేవుని ఆశీర్వాదం కలిగేందుకు మధ్యవర్తిత్వ ప్రార్థన చేయాలి.

## ప్రార్థనకు అట్టంకాలు ఏమిటి?

మన ప్రార్థన జీవితాన్ని ప్రభావితం చేసే అనేక అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమించడానికి మనం వాటిని గుర్తించాలి.

* **పాపం:** మన హృదయంలో పాపం ఉంటే, అది మనలను ప్రార్థించకుండా చేస్తుంది.
* **దేవుని వాక్యంపై ఆసక్తి లేకపోవడం:** దేవుని వాక్యం పట్ల నిర్లక్ష్యం, లోకం వైపు ఆకర్షితులవడం వల్ల మన ప్రార్థనా జీవితం బలహీన పడుతుంది.
* **ఇతరులతో సత్సంబంధాలు లేకపోవడం:** మనం ఇతరులను ప్రేమించకపోవడం, కోపం, అసూయ, క్షమించలేకపోవడం వంటివి మన హృదయాన్ని కఠినతరం చేసి, ప్రార్థనకు అడ్డంకిగా మారతాయి.
* **భయం, చింతలు అధికంగా ఉండటం:** మనం దేవుని శక్తిని చూడలేనప్పుడు, భయంతో నిండి విశ్వాసంతో ప్రార్థించలేం.
* **కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలు:** ఎన్నో ఒత్తిడులు మనల్ని ఇబ్బంది పెడుతున్నప్పుడు స్థిరంగా ప్రార్థించ లేక పోవచ్చు.

## స్థిరమైన ప్రార్థన జీవితాన్ని ఎలా కలిగియుండాలి?

మనము ఏ పనినైనా ఒక స్థిరమైన నిర్ణయం తీసుకుంటేనే చేయగలం. మనము పోరాడునది శరీరులతో కాదు గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడు చున్నాము (ఎఫెసీ 6:12). ప్రార్థన ప్రాముఖ్యతను గుర్తించి సమయాన్ని కేటాయించడం మన బాధ్యత.

* ప్రార్థన ఎప్పుడైనా చేయవచ్చు, కానీ నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించుకోవడం మరింత మంచిది. ఇది మన ఆధ్యాత్మిక జీవన శైలిని పటిష్టంగా ఉంచుతుంది.
* ప్రార్థనను క్రమపద్ధతిలో చేయడానికి ప్రార్థన డైరీ ఉపయోగపడుతుంది. రోజువారీగా విభాగించి, ప్రధాన అంశాలను రాసుకొని, వాటిపైన ప్రత్యేకంగా ప్రార్థించాలి.
* ప్రార్థన చేసేటప్పుడు నిద్ర లేదా ఇతర ఆలోచనలు ఆటంకంగా మారితే, తలుపు వేసుకొని, బిగ్గరగా ప్రార్థించడం ద్వారా ఏకాగ్రతను పెంచుకోవచ్చు.
* కొన్ని సమస్యలు సాధారణ ప్రార్థనతో తీరవచ్చు. అయితే, జటిలమైన సమస్యల కోసం ఉపవాస ప్రార్థన అలవాటు చేసుకోవాలి.
* దేవుడు మన ప్రార్థనలకు జవాబు ఇచ్చినప్పుడు, ఆ ఆశీర్వాదాన్ని గుర్తు చేసుకుంటూ స్తుతి చేయడం అలవాటుగా మార్చుకోవాలి. ఇది మన విశ్వాసాన్ని బలపరుస్తుంది.
* భయం, ఆందోళన మనలను ముంచెత్తినప్పుడు, దేవుని వాగ్దానాలను గుర్తు చేసు కోవాలి. దేవునితో సమయం గడిపేకొద్దీ, ఈ భయాల నుండి మనం బయటపడగలం. అంతేకాదు, దేవుని ప్రణాళికను మనం గ్రహించినప్పుడు, పరిస్థితుల ప్రభావం మనపై ఉండదు.
* ప్రార్థన ద్వారా దేవుడు ఇతరుల జీవితాల (సహవాసం) లో చేసిన కార్యాలను తెలుసు కోవడం మనలో ధైర్యాన్ని నింపుతుంది.
* మనం ఒంటరిగా మాత్రమే కాకుండా, తోటి విశ్వాసులతో కలిసి ప్రార్థన చేయడం ద్వారా, మనకు ఎదురైన ఆటంకాలను అధిగమించ గలుగుతాం.

## ముగింపు

హృదయమంతటితో, బలమంతటితో చేసే ప్రార్థన క్రైస్తవులు ఈ భూమిపై పొందగలిగే అత్యున్నత విజయం. మనం ఒంటరివారం కాదు. పరిశుద్ధాత్ముడు మన ప్రార్థనలో సహాయకుడు. అందుకే, ధైర్యంగా, నమ్మకంతో ప్రార్థనలో బలపడుదాం. మన దేవుడు మనతో ఉన్నాడు!

డా॥ఎం.వినీల,
బిహెచ్ఇయల్ జోన్, హైదరాబాద్

అవగాహన

# దైవిక సంభాషణ

## ప్రార్థనల ద్వారా దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం



నేటి డిజిటల్ యుగంలో, మన చుట్టూ ఉన్న వారితో, దూరంగా ఉన్నవారితో ఎలా కనెక్ట్ అవుతాం? సోషల్ మీడియా సహాయంతోనే కదా! అదే విధంగా, ప్రార్థన అనేది మనం దేవునితో అనుసంధానమై ఉండే మార్గం – ఇది మన ఆధ్యాత్మిక మాధ్యమం. "నీవు నాకు మొఱ్ఱపెట్టుము నేను నీకు ఉత్తరమిచ్చెదను; నీవు గ్రహింపలేని గొప్ప సంగతులను గూఢమైన సంగతులను నీకు తెలియజేసెదను" అని బైబిల్ చెబుతోంది (యిర్మీయా 33:3). సర్వశక్తిమంతుడైన దేవునితో మాట్లాడటానికి, సహవాసం చేయడానికి ప్రార్థన అనేది క్రైస్తవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. విశ్వాసులందరికీ ఇవ్వబడిన ఒక ప్రత్యేక ఆధికృత మరియు శక్తివంతమైన సాధనం ఇది. ఏ సమయంలోనైనా, ఏ ప్రదేశంలోనైనా, ఏ పరిస్థితిలోనైనా ధైర్యంగా దేవుని కృపా సింహాసనాన్ని సమీపించడానికి అనుమతిస్తుంది (హెబ్రీ 4:16).

ప్రార్థనలో, దేవుడు ఎవరు, ఆయన మన కోసం ఏమి చేశాడో దాని గురించి మనం ఆరాధిస్తాము మరియు కృతజ్ఞతలు తెలుపుతాము. చిన్న మరియు పెద్ద విషయాల్లో ఆయన సహాయం మరియు మార్గదర్శకత్వం కోసం అడుగుతాము, మన పాపాలను ఒప్పుకుంటాము మరియు మన పోరాటాలలో ఆయన బలం కోసం వెతుకుతాము.

### యేసు చూపిన మాదిరి

మనం ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రార్థించవచ్చు – నిద్ర లేచిన వెంటనే, భోజనానికి ముందు, బయటికి వెళ్ళే ముందు లేదా నిద్రపోయే ముందు. కానీ యేసుక్రీస్తు ప్రార్థన చేయడానికి ఒక చక్కని ఉదాహరణను చూపించారు.

మార్కు సువార్త 1:35లో ఇలా ఉంది: "అప్పుడాయన పెందలకడనే లేచి యింకను చీకటిగా నుండగానే బయలుదేరి అరణ్య ప్రదేశమునకు వెళ్లి అక్కడ ప్రార్థన చేసెను" దీని ద్వారా ఆయన తండ్రితో ఎంతగానో అనుసంధానమై ఉండేవారని తెలుస్తుంది.

యేసుక్రీస్తు దేవుని కుమారుడే అయినప్పటికీ, ఒక పరిపూర్ణ మానవునిగా ఆయన తండ్రిపై ఆధారపడ్డారు. హెబ్రీయులకు రాసిన పత్రిక 5:7లో ఈ విధంగా వ్రాయబడింది: "ఆయన తన శరీర దినములందు తన్ను మరణము నుండి రక్షించగలవానికి మహా రోదనతోను కన్నీళ్లతోను ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను" యేసుప్రభువు కూడా ప్రార్థనల ద్వారా తండ్రితో సంబంధం కొనసాగించేవాడు.

మత్తయి సువార్త 6:33లో యేసు ప్రభువు

ఇలా అన్నారు: "కాబట్టి మీరు మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును." మనం మన రోజును దేవునితో ప్రారంభిస్తే, అద్భుతమైన విషయాలు మన జీవితంలో జరుగుతాయి.

యేసుక్రీస్తు మత్తయి 6:6లో ఇంకా ఇలా చెప్పారు: "నీవు ప్రార్థన చేయునప్పుడు నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము; అప్పుడు రహస్యమున చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును" ప్రార్థనలో మనకు లభించే అత్యంత గొప్ప బహుమానం దేవుని సన్నిధిని అనుభవించడమే.

యోహాను 15:7లో ఆయన ఇలా వాగ్దానం చేశారు: "నాయందు మీరును మీ యందు నా మాటలును నిలిచియుండినయెడల మీకేది యిష్టమో అది అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును" మనం ఆయనలో ఉంటే, ఆయన మాటలు మనలో ఉంటే, మనం ఏమి అడిగినా అది మనకు అనుగ్రహించబడుతుంది. మనం తండ్రిని ఆయన నామమున ఏమి అడిగినా ఆయన తప్పకుండా ఇస్తానని యేసుక్రీస్తు మనకు నిశ్చయతను ఇచ్చారు (యోహాను 16:23).

## దేవుడు ప్రార్థనలకు ఎలా సమాధానమిస్తాడు?

మన జీవితాల్లో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక కోరిక ఉంటుంది. ఆ కోరిక నెరవేరాలని దేవుని ప్రార్థిస్తాం. అయితే, దేవుడు మన ప్రార్థనలకు ఎప్పుడూ ఒకేలా సమాధానం ఇవ్వడు. కొన్నిసార్లు 'సరే' అంటాడు, కొన్నిసార్లు 'లేదు' అంటాడు, మరికొన్నిసార్లు "వేచి ఉండు" అంటాడు. ఈ మూడు రకాల సమాధానాల వెనుక ఉన్న అర్థాన్ని, ఉద్దేశాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం.

### 1. అంగీకరించబడిన ప్రార్థనలు ("అవును")

కొన్నిసార్లు మనం అడిగిన వెంటనే దేవుడు మన ప్రార్థనలకు సమాధానం ఇస్తాడు. బైబిల్లో ఇలాంటి సందర్భాలు చాలా ఉన్నాయి.

1. దానియేలు, అతని స్నేహితులు నెబుకద్నెజరు రాజు కలను అర్థం చేసుకోవడానికి దేవుని జ్ఞానం కోసం ప్రార్థించారు. దేవుడు దానియేలుకు ఆ కలను బయలుపరచడం ద్వారా వారి ప్రార్థనను అంగీకరించాడు (దాని 2:16-19).
2. హేరోదు రాజు యూదును సంతోషపెట్టడానికి పేతురును బంధించినప్పుడు, ఆది సంఘం పేతురు కోసం ప్రార్థించింది. దేవుడు ఒక దేవదూత ద్వారా అతన్ని అద్భుతంగా విడుదల చేశాడు (అపొ కార్య 12:9).
3. హిజ్కియా రాజు అనారోగ్యంతో ఉన్నప్పుడు స్వస్థత కోసం ప్రార్థించాడు, దేవుడు అతని జీవితాన్ని 15 సంవత్సరాలు పొడిగించాడు (2 రాజులు 20:1-6).
4. హన్నా సంతానం కోసం ప్రార్థించింది, దేవుడు ఆమెకు సమూయేలును అనుగ్రహించాడు (1 సమూ 1:10-20).
5. దేవుని శక్తిని నిరూపించడానికి ఏలీయా ఆకాశం నుండి అగ్ని కోసం ప్రార్థించాడు, దేవుడు అగ్నిని పంపాడు (1 రాజులు 18:36-38).

### 2. సమాధానం రాని ప్రార్థనలు ('కాదు')

కొన్నిసార్లు దేవుడు మన ప్రార్థనలకు 'కాదు' అని సమాధానం ఇస్తాడు. దేవుడు ఎందుకు 'కాదు' అంటాడని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మనం అర్థం చేసుకోలేకపోయినా, దేవుడు 'కాదు' అనడం వెనుక ఒక గొప్ప ఉద్దేశం ఉంటుంది.

* మోషే వాగ్దాన దేశంలోకి ప్రవేశించాలని ప్రార్థించాడు, కానీ దేవుడు అతని అవిధేయత కారణంగా 'కాదు' అన్నాడు (ద్వితీ 3:23-27).
* దావీదు తన అనారోగ్యంతో ఉన్న బిడ్డ బ్రతకాలని ప్రార్థించాడు, కానీ దేవుడు అతని అభ్యర్థనను మన్నించలేదు, ఆ బిడ్డ చనిపోయాడు (2 సమూ 12:16-18).
* పౌలు తన శరీరంలోని ముల్లు తొలగించాలని మూడుసార్లు ప్రార్థించాడు, కానీ దేవుడు, "నా కృప నీకు చాలు" అని చెప్పాడు (2 కొరింథీ 12:7-9).
* యేసు గెత్సెమనే తోటలో, "ఈ గిన్నెను నా నుండి తొలగించు" అని సిలువ వేదనను

తప్పించమని ప్రార్థించాడు, కానీ దేవుడు దానిని తొలగించ లేదు. బదులుగా, ఆయన దేవుని చిత్తానికి లోబడ్డాడు (మత్తయి 26:39).

**'కాదు' అనే సమాధానాన్ని ఎలా అంగీకరించాలి? (సమాధానం రాని ప్రార్థన)**

జీవితంలో మనమెన్నో కోరికలు కోరుకుంటాం. కొన్ని నెరవేరుతాయి, కొన్ని నెరవేరకపోవచ్చు. ముఖ్యంగా, మనం అనారోగ్య సమస్య నుంచి కోలుకోకపోవడం, ప్రియమైన వారిని కోల్పోవడం, పెండ్లి కాకపోవడం, సంతానం లేకపోవడం వంటి విషయాల్లో దేవుడు మనకు అనుకూలంగా స్పందించ నప్పుడు మనమెలా నమ్మకం ఉంచాలి? క్లిష్ట పరిస్థితుల్లో దేవుడు మనల్ని నడిపిస్తున్నాడని ఎలా విశ్వసించాలి?

యేసుక్రీస్తు వలె దేవునికి మనల్ని మనం సమర్పించు కోవడానికి క్లిష్ట సమయాల్లో ప్రార్థన మనకు అండగా నిలుస్తుంది. యేసు సిలువ వేయబడటానికి ముందు తన తండ్రికి ఎలా సమర్పించుకున్నారో గుర్తు చేసుకోండి. మన కష్టాలను దేవుడు తొలగించనప్పుడు, ఆయన మనల్ని బలపరుస్తాడు, నూతన పరుస్తాడు. మనల్ని మనం దేవునికి అప్పగించుకోవడం ద్వారా ఓదార్పు పొందవచ్చు.

మనం కష్టాల్లో ఉన్నప్పుడు విశ్వాసుల సహవాసం చాలా అవసరం. తోటి విశ్వాసులు, స్నేహితులు, సంఘ సభ్యుల నుండి మద్దతు పొందడం ద్వారా మనో ధైర్యాన్ని నిలుపుకోవచ్చు. వారు మన కోసం ప్రార్థిస్తారు, మనల్ని కాపాడతారు. యేసు సిలువకు ముందు ప్రార్థిస్తున్నప్పుడు తన శిష్యులను ఆయనతో ఉండమని అడిగారు. మనకు కూడా అలాంటి సహవాసం అవసరం.

జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు దేవుని విడిచి పెట్టవద్దు. పట్టుదలతో ఉంటే వాటిని దాటవచ్చు. దేవుడు మనల్ని ఎప్పుడూ విడిచిపెట్టడు. ద్వితీయోపదేశ కాండము 31:8లో చెప్పినట్లుగా, "యెహోవాయే నీకు ముందుగా వెళ్లుచున్నాడు, ఆయనే నీకు తోడైయుండును, ఆయన నిన్ను విడువడు నిన్ను ఎడబాయడు, నీవు భయపడకుము, దిగులుపడకుము." ఈ వాగ్దానాన్ని గుర్తుంచుకోండి.

**3. దేవుడు ఆలస్యం చేసే ప్రార్థనలు (వేచియుండు)**

మన జీవితంలో కొన్నిసార్లు మనం చేసే ప్రార్థనలకు వెంటనే సమాధానం రాదు. అప్పుడు నిరుత్సాహపడ కుండా, దేవుడు మన కోసం ఏదో గొప్ప ప్రణాళికను సిద్ధం చేస్తున్నాడని నమ్మాలి. ఎందుకంటే దేవుని ఆలస్యం తిరస్కరణ కాదు.

**బైబిల్‌లో దీనికి చాలా ఉదాహరణలు ఉన్నాయి:**

- అబ్రాహాము, శారా దేవుడు వాగ్దానం చేసిన కుమారుడైన ఇస్సాకు కోసం 25 సంవత్సరాలు వేచి ఉన్నారు (ఆది 12:2-4, 21:1-3).
- యోసేపు తాను పరిపాలకుడు అవుతానని కలలు కన్నాడు, కానీ దేవుని ప్రణాళిక నిజమయ్యే ముందు బానిసత్వంలో, జైలులో 13 సంవత్సరాలు వేచి ఉండవలసి వచ్చింది (ఆది 37-41).
- దావీదు రాజుగా అభిషేకం పొందిన తరువాత కూడా ఇశ్రాయేలుకు రాజు అయ్యే ముందు చాలా సంవత్సరాలు వేచి ఉండాల్సి వచ్చింది (1 సమూ 16, 2 సమూ 5:4).
- జకర్యా, ఎలిజబెత్ చాలా సంవత్సరాలు పిల్లల కోసం ప్రార్థించారు. వారి వృద్ధాప్యంలో దేవుడు వారికి బాప్తిస్మమిచ్చు యోహానును ప్రసాదించాడు (లూకా 1:5-13).

"దేవుని ఆలస్యం ఆయన తిరస్కరణ కాదు." "వేచి ఉండటం" అంటే "లేదు" అని కాదు, "ఇంకా కాదు" అని అర్థం. దేవుడు ఆ పరిస్థితిపై ఇంకా పని చేస్తున్నాడని అర్థం చేసుకోవాలి.

కీర్తన 40:1లో దావీదు ఇలా అంటాడు, "యెహోవాకొరకు నేను సహనముతో కనిపెట్టు కొంటిని ఆయన నాకు చెవియొగ్గి నా మొఱ్ఱ ఆల కించెను."

కీర్తన 27:14, "ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము." అని ప్రోత్సహిస్తుంది.

దేవుడు ఒక మంచి కారణం కోసం జవాబున్ని ఆల

స్యం చేయవచ్చు. మీ విశ్వాసాన్ని బలపరచడానికి, ఒక కొత్త మార్గాన్ని చూపించడానికి, ఇతరుల ద్వారా పని చేయడానికి, మీ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దడానికి మరియు తన పరిపూర్ణ సమయంలో తన ప్రణాళికను నెరవేర్చడానికి వేచి ఉండాల్సి వస్తుంది.

### మనం ఆలస్యానికి ఎలా స్పందించాలి?

* విశ్వాసంతో ప్రార్థన చేస్తూ ఉండాలి.
* దేవుని సమయంపై నమ్మకం ఉంచాలి.
* లక్ష్యాన్ని చేరుకోవడం కంటే వ్యక్తిగత ఎదుగుదలపై దృష్టి పెట్టాలి.
* ఓర్పును అభివృద్ధి చేసుకోవాలి.
* దేవుని జ్ఞానం, సార్వభౌమాధికారంపై ఆధార పడాలి.

### ప్రార్థనలు ఫలించకుండా అడ్డుకునే అంశాలు

ప్రార్థనలు ప్రభావవంతంగా ఉండకుండా చేసే కొన్ని ముఖ్యమైన విషయాలను ఇప్పుడు చూద్దాం.

* **దాచుకున్న పాపం (కీర్తనలు 66:18-19):** మనం చేసిన పాపాలను ఒప్పుకోకుండా కప్పుకుంటే, అది మన ప్రార్థనలకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. దేవునితో మన సంబంధాన్ని తెంచుకుంటుంది. కాబట్టి, మన తప్పులను నిజాయితీగా ఒప్పుకుని క్షమాపణ కోరాలి.
* **హృదయంలో విగ్రహాలు (యెహెజ్కేలు 14:3):** మన హృదయంలో దేవునికి బదులుగా ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇస్తే, అది విగ్రహారాధనతో సమానం. ఇది మన ప్రార్థనలను నిష్ఫలం చేస్తుంది. దేవుణ్ణి మాత్రమే మన హృదయంలో ఉంచుకోవాలి.
* **తప్పుడు ఉద్దేశాలు (యాకోబు 4:3):** స్వార్థ పూరితమైన కోరికలతో ప్రార్థన చేస్తే, అది దేవునికి ఇష్టం ఉండదు. మన ప్రార్థనలు ఇతరులకు మేలు చేసేవిగా, దేవుని చిత్తానికి అనుగుణంగా ఉండాలి.
* **నమ్మకం లేకపోవడం (మార్కు 11:24, యాకోబు 1:5-8):** ప్రార్థించేటప్పుడు విశ్వాసం అనేది చాలా ముఖ్యం. సందేహిస్తూ ప్రార్థిస్తే, మన ప్రార్థనలకు జవాబు రాదు. సంపూర్ణ విశ్వాసంతో ప్రార్థించాలి.
* **క్షమించలేని మనస్సు (మార్కు 11:25):** ఇతరులను క్షమించలేకపోతే, మన ప్రార్థనలను దేవుడు ఆలకించడు. క్షమాగుణం కలిగి ఉండటం చాలా అవసరం.
* **పట్టుదల లేకపోవడం (లూకా 18:1):** ప్రార్థనలో పట్టుదల చాలా ముఖ్యం. ఒకసారి ప్రార్థించి విడిచిపెట్టకుండా, ఫలితం వచ్చే వరకు పట్టుదలతో ప్రార్థించాలి.
* **ప్రార్థనను నిర్లక్ష్యం చేయడం (మత్తయి 26:40):** ప్రార్థన చేయకుండా నిర్లక్ష్యం చేస్తే, దేవునితో మన సంబంధం బలహీనపడు తుంది. క్రమం తప్పకుండా ప్రార్థన చేయడం చాలా అవసరం.
* **దేవుని వాక్యానికి అవిధేయత (జెకర్యా 7: 11-13):** దేవుని ఆజ్ఞలను పాటించకుండా అవిధేయత చూపిస్తే, మన ప్రార్థనలను దేవుడు వినడు. దేవుని వాక్యానికి లోబడి జీవించాలి.
* **పేదలను నిర్లక్ష్యం చేయడం (సామె 21:13):** పేదలను, అవసరంలో ఉన్నవారిని నిర్లక్ష్యం చేస్తే, మనం ప్రార్థన చేసినప్పుడు దేవుడూ ఆలకించడు.

ఈ అడ్డంకులేవీ లేకపోయినా, మన ప్రార్థనలకు ఎల్లప్పుడూ 'అవును' అనే సమాధానం వస్తుందని గ్యారెంటీ లేదు. ప్రార్థన అంటే కేవలం 'అవును' సమాధానాలు పొందడం మాత్రమే కాదు; దేవుని చిత్తం నెరవేరాలని కోరుకోవడం కూడా. కొన్నిసార్లు, 'కాదు' లేదా 'వేచి ఉండండి' అనే సమాధానం కూడా దేవుడు మీ ప్రార్థన విన్నాడని, ఆయన చిత్తం నెరవేర్చడానికి ఆ జవాబు ఇచ్చాడని రుజువు చేస్తుంది.

### ముగించే ముందు

మనం చేసిన తప్పులను తెలుసుకుని వాటి నుండి దూరంగా ఉండాలి. మన హృదయాలలో దేవుని కంటే ఏదీ ముఖ్యం కాదు. వీడియో గేమ్స్, ఫోన్‌లో గంటల తరబడి గడపడం, అసభ్యకరమైన చిత్రాలు చూడటం, చాటింగ్ చేయడం, వృత్తి, ఆస్తులు, కుటుంబం లేదా మనం చేసే పరిచర్య

కూడా దేవుని కన్నా ఎక్కువ కాదు. మనం అడిగే దానికంటే, ఎందుకు అడుగుతున్నామనేది కూడా ముఖ్యం. మన ప్రార్థనలకు సమాధానం రావాలంటే, మన ఉద్దేశాలు కూడా పరిశుద్ధంగా ఉండాలి.

మనస్సులో చేదు భావాలు, క్షమించలేని స్వభావం ఉంటే, అది దేవునితో మన సంబంధాన్ని దెబ్బ తీస్తుంది. అంతేకాదు, మన ప్రార్థనలకు ఆటంకం కలిగిస్తుంది. దేవుని చిత్తానుసారంగా మనం ప్రార్థించినప్పుడు, ఆయన తప్పకుండా వింటాడని నమ్మడమే విశ్వాసం.

మనం సోషల్ మీడియాలో, టీవీ చూడటంలో, ఇంటర్నెట్‌లో ఎంతో సమయం గడుపుతాం. కానీ ప్రార్థన కోసం మాత్రం తక్కువ సమయం కేటాయిస్తాం. హడావుడిగా కొన్ని నిమిషాలు ప్రార్థించి వదిలేస్తాం. మన హృదయాన్ని సిద్ధం చేసుకోకుండా ప్రార్థిస్తే, దేవుడు మన మాట వింటాడని ఎలా అనుకోగలం? మనం ఆయనకు తక్కువ ప్రాధాన్యత ఇస్తే, ఆయన నుండి ఎక్కువ ఎలా ఆశించగలం?

మన మనస్సులోని ప్రతి ఆలోచనను, ప్రతి పనిని దేవునికి సమర్పించి ఆయన సమాధానాన్ని పొందుదాం.

షాలోమ్! (దేవుని శాంతి మీతో ఉండును గాక!)

**బిబ్లియోగ్రఫీ:**

1. ప్రార్థన మరియు ప్రార్థించే వ్యక్తులు – ఇ. యం. బౌండ్స్

– బ్రహ్మారాజు గొల్ల
అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఐటీ వరంగల్
మరియు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, హనుమకొండ

* * * * * *






# వారిని ప్రభావితులుగా చేసింది తల్లి యొక్క ప్రార్థన

ప్రతి గొప్ప ఉద్యమం వెనుక, రూపాంతరం చెందిన ప్రతి జీవితం వెనుక, శాశ్వత ప్రభావాన్ని చూపే ప్రతి కార్యం వెనుక ఒక నిశ్శబ్దమైన, శక్తివంతమైన శక్తి దాగి ఉంటుంది – అదే ప్రార్థన.

చరిత్ర పొడవునా, కొంతమంది వ్యక్తులు సవాళ్లను అధిగమించి, మార్పుకు కారకులుగా నిలిచారు. వారి ప్రభావం నేటికీ ప్రపంచాన్ని మలుపు తిప్పుతూనే ఉంది. కానీ వారి శక్తికి, ప్రభావానికి మూలమేమిటి?

చాలా సందర్భాలలో, వారి ప్రయాణానికి చోదక శక్తిగా నిలిచేది ఒక విశ్వాసురాలైన తల్లి చేసే ప్రార్థనలు. ఒక తల్లి చేసే ప్రార్థనలు ప్రపంచానికి వినిపించకపోయినా, దేవుడు వింటాడు. ఆ ప్రార్థనలు వారి భవితను తీర్చిదిద్దుతాయి, తప్పుదారి పట్టిన హృదయాలను తిరిగి ఆయన వైపుకు మళ్లిస్తాయి.

ఇలాంటి అనేక కథలలో, తల్లి చేసిన ప్రార్థనతో జీవితాలు మారిన ఇద్దరు గొప్ప వ్యక్తుల జీవితాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఓ తిరుగుబాటుదారుడు మిషనరీగా మారిన వైనం**

మే 21, 1832న ఇంగ్లాండ్‌లో అమేలియా అనే భక్తిగల క్రైస్తవ తల్లికి ఒక కుమారుడు జన్మించాడు. దైవికమైన తల్లిదండ్రుల ఆదర్శప్రాయమైన జీవితం, వారి బోధనలు ఉన్నప్పటికీ, అతడు మాత్రం ఒక సందేహించే, లోక సంబంధమైన యువకునిగా ఎదిగాడు. విశ్వాసానికి దూరంగా ఉంటూ, తన తల్లి నమ్మకాలను హేళన చేస్తూ, లోకసంబంధమైన సుఖాల వెంటపడ్డాడు.

అయితే, దృఢమైన విశ్వాసానికి మారుపేరుగా నిలిచిన ఆ తల్లి మాత్రం అతని కోసం ప్రార్థించడం ఎప్పుడూ ఆపలేదు. దేవుడు సరైన సమయంలో తప్పకుండా అతని జీవితంలో కలుగజేసుకుంటాడని నమ్ముతూ ఆమె వేడుకుంటూనే ఉంది.

ఆ తల్లి ప్రార్థన శక్తికి నిదర్శనంగా నిలిచింది అతని జీవితంలో వచ్చిన మార్పు. సుమారు అతనికి దాదాపు 17 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఒకరోజు మధ్యాహ్నం, సమయం గడపడానికి ఏదైనా పుస్తకం కోసం వెతుకుతూ తన తండ్రి లైబ్రరీలోకి వెళ్ళాడు. అక్కడ అతనికి ఒక సువార్త కరపత్రం కనిపించింది. “దీనిలో మొదట ఒక కథ ఉంటుంది, చివరలో ఒక ప్రసంగం ఉంటుంది. నేను కథను మాత్రమే చదివి ప్రసంగాన్ని వదిలివేస్తాను” అని అను కున్నాడు.

అదే రోజు మధ్యాహ్నం, అతని తల్లి – ఆమె దాదాపు డెబ్బై లేదా ఎనభై మైళ్ల దూరంలో ఉంది – తన కుమారుని రక్షణ కోసం తీవ్రంగా తపించింది. ఆమె తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని, తన ప్రార్థనలకు సమాధానం వచ్చే వరకు గది విడిచి వెళ్లకూడదని నిర్ణయించుకుంది. గంటల తరబడి ఆమె వేడుకుంటూనే ఉంది, చివరికి దేవుడు తన ప్రార్థనలకు సమాధానమిచ్చాడని సంతోషంగా ఆమెకు అనిపించింది.

ఇంతలో, ఆ యువకుడు కరపత్రాన్ని చదువు తుండగా, తాను మోకాలు వేసి ప్రార్థించడం ద్వారా

క్రీస్తు ద్వారా రక్షణను అంగీకరించడం మాత్రమే మిగిలి ఉందని ఒక్కసారిగా గ్రహించాడు.

దూరంగా ఉన్న అతని తల్లి, అదే రోజున తన కుమారుడు క్రీస్తును కలుసుకోవాలని ప్రార్థిస్తుండగా, ఈ కుమారుడు రక్షణానందాన్ని అనుభవించాడు. సిలువపై క్రీస్తు చేసిన పరిపూర్ణ కార్యాన్ని నమ్మడం మాత్రమే తాను చేయవల సిందంతా అని గ్రహించాడు. విశ్వాసంతో అతడు నమ్మాడు; ప్రార్థనతో రక్షణను పొందాడు.

యోహాను 14:13లో ఇవ్వబడిన వాగ్దానంలో తల్లి, కొడుకు ఇద్దరూ నిరీక్షణను కనుగొన్నారు. "మీరు నా నామమున దేనినడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమపరచబడుటకై దానిని చేతును."

తల్లి ప్రార్థనల ద్వారా రూపాంతరం చెందిన ఆ యువకుడు, తరువాత మిషనరీగా మారి, చైనాకు మరియు ఇతర ప్రాంతాలకు వెళ్లి, సువార్తను ఎన్నడూ వినని వారికి దానిని తెలియజేశాడు. ఆయన పేరే జేమ్స్ హడ్సన్ టేలర్.

**ఓటమి అంచు నుండి గొప్ప వేదాంతిగా మారిన వ్యక్తి**

సుమారు 19 మంది పిల్లలకి తల్లి అయిన సుసన్నా, ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చే ఒక భక్తురాలు. ఇంత పెద్ద కుటుంబాన్ని చూసుకోవడం కష్టమైనప్పటికీ, ఆమె ఎప్పుడూ ప్రార్థన చేయడానికి సమయం కేటాయించేది. ఆమె తలకు తన ఏప్రాన్ కప్పుకుని, దేవునితో మాట్లాడటానికి ఒక ఏకాంత స్థలాన్ని సృష్టించుకునేది.

ఆమె కుమారులలో ఒకడు గొప్ప ప్రసంగీకుడై నప్పటికీ, సందేహాలతో పోరాడుతూ, మనశ్శాంతి కోసం ఆరాటపడేవాడు. మతపరమైన నేపథ్యం, పరిచర్యలో ఉన్నప్పటికీ, అతనికి రక్షణ లభించినట్లు అనిపించలేదు. అతని హృదయం ఎప్పుడూ ఏదో వెలితిగా ఉండేది. తను నిజంగా రక్షింపబడ్డానా అని సందేహించేవాడు.

అలాంటి సమయంలో, ఒకరోజు లండన్‌లో జరిగిన ఒక సమావేశానికి హాజరయ్యాడు. అక్కడ మార్టిన్ లూథర్ రాసిన 'రోమీయులకు రాసిన పత్రిక' లోని ముందుమాటను చదువుతుండగా, రాత్రి 8:45 గంటల ప్రాంతంలో అతనిలో ఒక గొప్ప మార్పు సంభవించింది.

అతను తన డైరీలో ఇలా రాసుకున్నాడు: "నేను క్రీస్తును నమ్మాను. రక్షణ కోసం క్రీస్తుపైనే ఆధార పడ్డాను. ఆయన నా పాపాలను, నా దోషాలను కూడా తొలగించాడని, నన్ను పాప మరణాల నుండి రక్షించాడని నాకు ఒక నిశ్చయత లభించింది."

ఆ మాటలు అతని హృదయాన్ని నింపడంతో, అతని ఆత్మ వెలిగింపబడింది. ఆ క్షణం అతని జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. సందేహాల నుండి తిరుగులేని విశ్వాసంలోకి అతన్ని నడిపించింది.

ఈ పరివర్తన అతన్ని అన్ని కాలాలలోనూ గొప్ప క్రైస్తవ ఆలోచనాపరులలో ఒకడిగా నిలబెట్టింది. అతని వేదాంత రచనలు నేటికీ క్రైస్తవ విశ్వాసాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఆ సమావేశంలో కలిగిన అను భవం, అతని తల్లి చేసిన నమ్మకమైన ప్రార్థనలు, అతను చరిత్రలో గొప్ప ప్రసంగీకులలో ఒకడిగా ఎదగడానికి మార్గం సుగమం చేశాయి. ఆయనే జాన్ వెస్లీ!

**ముగింపు**

జేమ్స్ హడ్సన్ టేలర్ మరియు జాన్ వెస్లీ జీవితాలు మనకు ఒక శక్తివంతమైన సత్యాన్ని గుర్తుచేస్తాయిప్రార్థన అనేది జీవితాలను మార్చగల, చరిత్రను మలచగల మరియు తరాలపై ప్రభావం చూపగల అద్భుతమైన సాధనం.

"సుసన్నా వెస్లీ, అమెలియా టేలర్ వంటి తల్లుల ప్రార్థనలు, జాన్ వెస్లీ, హడ్సన్ టేలర్ లాంటి మహాను భావులను ఈ లోకానికి అందించారు.

"శక్తివంతమైన ప్రార్థనే వారిని ప్రభావితులుగా చేసింది".

వారి ద్వారా ఎంతో మంది ప్రభువును తెలుసు కున్నారు. యుఇయస్ఐ తెలంగాణ విద్యార్థి సేవలో ఉన్న మనం కూడా ఆ విధమైన విశ్వాసంతో ప్రార్థిస్తే, మన తరం నుండి ఎంతో మంది క్రీస్తు కోసం నిలబడే జాన్ వెస్లీలు, హడ్సన్ టేలర్లును చూడగలం.

అయితే, మన ప్రార్థనలు ఈ తరం నుండి అలాంటి ప్రభావితులను లేపగలవా?

(మూలం: ఆన్‌లైన్)

– టీనా, ఉస్మానియా యూనివర్సిటీ,
హైదరాబాద్



# నీ మౌనధ్యాన సమయం ఎలా ఉంది?

## (కీర్తనల గ్రంథము 1:2)

మన జీవితంలో ఆత్మీయతను పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. కానీ, ఈ ఆత్మీయతను సాధించడానికి మనం ఎంత సమయం కేటాయిస్తున్నామో ఆలోచించారా? మైక్రో ప్రేయర్ సెల్‌లో మెంటీస్‌ను, సహవాసములో తోటి విశ్వాసులను "క్వైట్ టైమ్" చేసుకున్నారా? అని అడిగినప్పుడు, చాలా మంది "పాటించడం లేదు" అని సమాధానం చెబుతున్నారు. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే, మన ఆత్మీయ జీవితంలో క్వైట్ టైమ్ (మౌనధ్యాన సమయం) యొక్క ప్రాముఖ్యతను మనం మరచిపోకూడదు.

కీర్తనల గ్రంథం మొదటి అధ్యాయం మనందరికీ సుపరిచితమే. దేవుని వాక్యాన్ని ధ్యానించడం వల్ల కలిగే లాభాలు ఏమిటో, ఆత్మీయ ఎదుగుదలకు దేవుని వాక్యం ఎలా సహాయపడుతుందో, ఒకవేళ ధ్యానించకపోతే కలిగే నష్టాలు ఏమిటో ఈ అధ్యాయం మనకు స్పష్టంగా తెలియజేస్తుంది. దేవుని వాక్యానికి ఉన్న విలువను అనేక సందర్భాల్లో మనం తెలుసుకున్నాం. ఈరోజు మన మౌనధ్యాన సమయం ఎలా ఉందో ఒకసారి పరిశీలించుకుందాం.

### మౌనధ్యాన సమయం అంటే ఏమిటి?

"మౌనధ్యాన సమయం" అంటే యేసుతో ఏకాంతంగా గడపడం, ఆయనను గురించి ధ్యానించడం, ఆయనతో స్థిరమైన సహవాసం కలిగి ఉండటం. ఇది మన ఆత్మీయ జీవితాలను పరీక్షించుకోవడానికి ఒక గొప్ప అవకాశం.

మరో విధంగా చెప్పాలంటే, ప్రతిరోజు మనం గడిపే మౌనధ్యాన సమయం లేఖనాలను లోతుగా ధ్యానించడానికి సహాయపడుతుంది. ఈ ప్రక్రియలో దేవునితో ఒక లోతైన మరియు బలమైన సంబంధాన్ని మనం అభివృద్ధి చేసుకుంటాము.

మౌనధ్యాన సమయం అనేది ఒక ఆచారం కాదు, కానీ ప్రతి క్రైస్తవుడికి దేవునితో ఉండే సన్నిహిత సంబంధానికి ఒక ముఖ్యమైన లక్షణం. ఇది మన ఆత్మీయ జీవితానికి ఒక వెలుగులాంటిది. కాబట్టి, మన జీవితంలో మౌనధ్యాన సమయానికి సరైన స్థానం కల్పించుకొని, దేవునితో అనుబంధాన్ని మరింత బలపరుచుకుందాం.

### దేవుని వాక్యములో ఆనందించుట

కీర్తన 1:2లో కీర్తనాకారుడు "యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు" అని స్పష్టంగా చెబుతున్నాడు. ఇక్కడ ధర్మశాస్త్రము అంటే మోషే రాసిన మొదటి ఐదు గ్రంథాలు మాత్రమే కాదు, ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు దేవుడు తన మాటలను బైబిల్లో ఏవైతే వ్రాయించాడో వాటియందు ఆనందించడమని అర్థం.

అయితే, ఎవరు దేవుని వాక్యంలో ఆనందించ గలరు? ఎవరైతే మారుమనస్సు పొంది ఆత్మీయ ఎదుగుదల కొరకు ఆలోచన కలిగి ఉంటారో, వారు మాత్రమే ధర్మశాస్త్రమునందు ఆనందించ గలరు. ఎందుకంటే, దేవుని వాక్యం మన హృదయాలను పరిశుద్ధపరచి, మన మనస్సులను నూతనపరుస్తుంది.

#### ఎ) చేఫెట్స్ chêphets (Hebrew)

హీబ్రూ భాషలో "ఆనందం" అనేది "చేఫెట్స్" అని పిలవబడుతుంది. "ఆనందించుట" అనే పదం యొక్క అర్థం ఏదైనా ఒక దాని నుండి

ఆనందం పొందడం. ఇది ఆనందం, కోరిక గురించి మాట్లాడుతుంది. ఏదైనా ఒక విషయం నుండి గొప్ప ఆనందపు అనుభూతిని పొందడమే నిజమైన ఆనందం.

"నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని; సైన్యముల కధిపతివగు యెహోవా, దేవా, నీ పేరు నాకు పెట్టబడెను గనుక నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి" (యిర్మియా 15:16).

ఈ వాక్యంలో, పవక్తయైన యిర్మియా దేవుని వాక్యం ద్వారా పొందిన ఆనందాన్ని, సంతృప్తిని తెలియ జేస్తున్నాడు. దేవుని వాక్యాలు అతనికి దొరికినప్పుడు, వాటిని స్వీకరించి, వాటిని తన హృదయంలో నింపుకున్నాడు. ఆ వాక్యాలు అతనికి సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించాయి, ఎందుకంటే అవి సర్వశక్తిమంతుడైన దేవుని నుండి వచ్చాయి.

### బి) ప్రపంచంలోని ఆనందాలు

ఈ లోకంలో మనకు సంతోషాన్ని కలిగించేవి చాలా ఉన్నాయి. కొందరికి మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, గేమ్స్, కార్టూన్లు, యూట్యూబ్ వంటి వాటిలో ఆనందం దొరుకుతుంది. మరి కొందరు ఉద్యోగం, అభిరుచి లేదా వృత్తిలో ఆనందాన్ని పొందుతారు. కొందరు స్నేహంలో, మరికొందరు డబ్బులో లేదా డబ్బుతో కొనుగోలు చేసే వస్తువులలో ఆనందాన్ని వెతుకుతారు. అయితే, ఈ ఆనందాలన్నీ తాత్కాలికమైనవి మాత్రమే.

### సి) నిజమైన ఆనందం

నిజమైన ఆనందం దేవుని వాక్యంలో ఉంది. దేవుని వాక్యం మనకు సంతోషాన్ని, ఆత్మీయ సంతృప్తిని ఇవ్వగలదు. నీతిమంతుడు, రక్షణ పొందిన వ్యక్తి ధర్మశాస్త్రంలో తన ఆనందాన్ని వెతుకుతాడు. దేవుని వాక్యం మన జీవితాలకు వెలుగునిస్తుంది, మనల్ని సరైన మార్గంలో నడిపిస్తుంది.

### డి) లోకంలోని ఆనందాల వల్ల కలిగే నష్టాలు

చాలాసార్లు, ముఖ్యంగా యువనన్నులు తమ హృదయాలను లోకంలోని వాటితో నింపుకుంటారు. పాపం నుండి వచ్చే ఆనందాలతో సంతృప్తి చెంది, అవే శాశ్వతమని ఆలోచిస్తారు. దీని ఫలితం ఏమి టంటే దేవుని వాక్యంతో సమయం గడపలేక పోతున్నారు. లోకంలోని పాపానికి బానిసలవుతారు. తాత్కాలికమైన వాటిలో ఎక్కువ సమయం గడుపుతూ, నిత్యమైన వాటిని విడిచిపెడతారు.

### ఇ) దేవుని వాక్యం యొక్క ప్రాముఖ్యత

దేవుని వాక్యం మనకు సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా, మన జీవితాలకు ఆత్మీయ సంతృప్తిని కూడా ఇస్తుంది. ఇది మనల్ని బలపరుస్తుంది, మనల్ని ఓదార్చుతుంది, మనకు మార్గనిర్దేశం చేస్తుంది. దేవుని వాక్యం మనకు నిత్యజీవాన్ని ఇస్తుంది.

### ఎఫ్) స్వీయ పరీక్ష

* దేవుని వాక్యంలో మీరు ఆనందిస్తున్నారా?
* మీ జీవితంలో మిమ్మల్ని సంతోషంగా ఉంచేది ఏమిటి?
* దేవుని వాక్యం చదువుతుంటే మీకు ఏమని పిస్తుంది?

## దేవుని వాక్యాన్ని ధ్యానించడంలో అంకితభావం

మన జీవితాల్లో ఆనందం, శాంతి, మరి యు ఆత్మీయ ఎదుగుదల కోసం ఏదైనా ఒక అద్భుతమైన మార్గం ఉందంటే, అది దేవుని వాక్యాన్ని ధ్యానించడం. నీతిమంతుడు దేవుని వాక్యం గురించి ఆలోచిస్తూ, దానిని ధ్యానిస్తూ తన హృదయంలో నిలుపుకుంటాడు. ఇది కేవలం చదవటానికి పరిమితమైన విషయం కాదు, మన హృదయంలో నిలిచి మన జీవితం మారడానికి దోహదపడాలి.

ధ్యానం అంటే ఏంటో ఆలోచిద్దాం. ఆహారాన్ని మనం నమిలి తినడం వల్ల రుచి అనుభవించి శక్తిని పొందినట్లే, దేవుని వాక్యాన్ని కూడా మనం ధ్యానించడం ద్వారా మన ఆత్మీయ జీవితం బలపడుతుంది.

చాలామంది క్రైస్తవులు దేవుని వాక్యాన్ని చదువుతారు కానీ ధ్యానం చేయరు. పైపైగా చదివి, "నేను బైబిల్ చదివాను" అనే తృప్తిలో ఉంటారు. కానీ అది మన హృదయాలను స్పృశించి మన జీవితాలను మారు స్తుందా? ధ్యానం లేకుండా చదివినంత మాత్రాన అది మన ఆలోచనలను, మన ఆత్మీయ స్థితిని ప్రభావితం చేయదు.

"ఈ ధర్మశాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపో కూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు" (యెహోషువ 1:8).

### ఎ) ధ్యానించడమంటే ఏమిటి?

హీబ్రూ భాషలో "Meditates" (hâgâh) అనగా గంభీరంగా ఆలోచించడం, మనసులో మాటలుగా మౌనంగా పలకడం, సమగ్రంగా పరిశీలించడం. ఇది శ్రద్ధగా వినడం, మనసులో పదే పదే దానిని పునరావృతం చేసుకోవడం.

"నా మంచము మీద నిన్ను జ్ఞాపకము చేసికొని, రాత్రి జాములయందు నిన్ను ధ్యానించునప్పుడు" (కీర్తన 63:4).

### బి) ధ్యానానికి ప్రాముఖ్యత

మన జీవితంలో మనం ఎటువంటి ప్రాముఖ్యత ఇస్తామో, అదే మన ఆత్మీయ స్థితిని నిర్ణయిస్తుంది. ఒకవేళ మనం ఖాళీ సమయాన్ని టీవీ, మొబైల్, ఇతర వ్యవహారాలకు ఇస్తే, మన ఆత్మీయ క్రమశిక్షణ తప్పిపోతుంది. దేవుని వాక్యాన్ని ధ్యానించటానికి అభిరుచి లేకపోవడం మన ఆత్మీయ లోపాన్ని సూచిస్తుంది.

మీరు దేవుని వాక్యాన్ని ధ్యానించడానికి సమయాన్ని వెచ్చిస్తున్నారా? లేక మీ సమయం ఇతర నిరుపయోగమైన విషయాలకు వెచ్చించ బడుతోంది?

కీర్తనకారుడు మనకు మహత్తరమైన ఓ సూచన ఇస్తున్నాడు.

* మనకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా దేవుని వాక్యాన్ని ధ్యానించాలి
* బైబిల్‌ను చదివినప్పుడల్లా మననం చేయాలి
* దేవుని వాక్యంలో ఆనందం పొందాలి

"నా దృష్టి నీ ఆజ్ఞలపై నిలుపుచేసి నీ మాటలలో ఆనందించెదను" (కీర్తన 119:47).

### సి) ధ్యానం ఆనందాన్ని ఇస్తుంది, భారమైనది కాదు

దేవుని వాక్యాన్ని ధ్యానించడం, ఒక భారం కాదు, అది ఆనందం. ఎవరో చెప్పినట్లుగా చదవడం కాదు, మన మనసులో ముద్రించుకోవడం ముఖ్యం.

"బైబిల్ చదవడం కష్టంగా అనిపిస్తున్నదా? అలా అయితే మన జీవితంలో ఏదో తప్పు జరుగుతోందని గ్రహించాలి." అని జాన్ పైపర్ అంటాడు.

వాక్యాన్ని ధ్యానించడం ద్వారా మన ఆత్మీయత పెరుగు తుంది, మన హృదయాలకు శాంతి కలుగుతుంది. ఇది మన ఆలోచనా విధానాన్ని మార్చి, దేవుని పట్ల మరింత సమీపంగా ఉండేలా చేస్తుంది.

### డి) నేటి పరిస్థితి

ఈరోజుల్లో యవనులు మౌనధ్యాన సమయాన్ని నియమంగా పాటించడం లేదు. వారిలో

* తల్లిదండ్రుల భయంతో ధ్యానం చేసే వారు
* ఆచారంగా అనుసరించే వారు
* ధ్యానించకపోతే దినమంతా ఏదో ఒక రకంగా ఉంటుంది కాబట్టి ధ్యానించేవారు
* ప్రతి ఉదయం బిజీగా ఉండి, మౌన ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వని వారు
* ఆలస్యంగా లేచి అరకొర ప్రార్థన చేయడం, వాక్యాన్ని చదివే వారు

"గత ఏడాది మీరు అనుదిన మౌనధ్యాన సమయానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారు?"

"దేవుని వాక్యాన్ని ఎన్ని సార్లు విస్మరించారు?"

ఇవి మనం ఆలోచించాల్సిన విషయాలు. ఈ సంవత్సరంలోనైనా మనం మౌనధ్యాన సమయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి.

### అన్వయింపు

1. మీరు ఆత్మీయ ఆనందాన్ని పొందాలను కుంటున్నారా? అయితే, దేవుని వాక్యాన్ని ధ్యానించండి.
2. మీరు దేవునికి దగ్గరవ్వాలనుకుంటున్నారా? అయితే, దేవుని వాక్యాన్ని ధ్యానించండి.
3. మీ దశ, దిశ మార్చుకోవాలనుకుంటున్నారా? అయితే, దేవుని వాక్యాన్ని ధ్యానించండి.
4. పాపానికి బానిస కాకుండా ఉండాలను కుంటున్నారా? అయితే, దేవుని వాక్యాన్ని ధ్యానించండి.

ఇప్పటి నుంచే నిర్ణయం తీసుకోండి. చక్కని మౌనధ్యాన సమయాన్ని కలిగియుండి మీ జీవితాన్ని దేవుని దారిలో నడిపించండి!

– డా॥ వెంకటపతి,
జీడిమెట్ల జోన్, హైదరాబాద్.




# నిష్క్రియాత్మకత వద్దు లక్ష్యంతో ముందుకు సాగండి!

నేటి ఆధునిక యుగంలో సోషల్ మీడియా ఒక ముఖ్యమైన భాగంగా మారింది. ఇది మనకు కనెక్ట్ అవ్వడానికి, వినోదం పొందడానికి అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. కానీ, దీనిని విచ్చలవిడిగా వాడటం వల్ల చాలామంది, ముఖ్యంగా టీనేజ్ పిల్లలు సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారు. ఈ వ్యసనం మితిమీరిన స్క్రీన్ టైమ్, మాటిమాటికీ నోటిఫికేషన్స్ చూడటం, నిజ జీవిత సంబంధాలపై మరియు బాధ్యతలపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. దీని గురించి క్షుణ్ణంగా తెలుసుకొని మనల్ని మనం కాపాడుకుందాం.

ఈ వ్యసనానికి కారణాలు అనేకం. తక్కువ ఆత్మవిశ్వాసం మరియు మానసిక ఆరోగ్య సమస్యలు వంటి మానసిక అంశాలు, నిరంతరాయ స్క్రోలింగ్ మరియు వ్యక్తిగతీకరించిన నోటిఫికేషన్‌లు వంటి సాంకేతిక అంశాలు, అలాగే పీర్ ప్రెజర్ (సహచరుల ఒత్తిడి) మరియు అసాధారణ కంటెంట్‌కు గురి కావడం వంటి సామాజిక ప్రభావాలు మనల్ని బానిసలుగా మారుస్తాయి.

అయితే, ఈ వ్యసనం నుండి బయటపడటానికి అనేక మార్గాలు ఉన్నాయి. వీటిని అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆన్‌లైన్ అలవాట్లను పెంపొందించుకోవచ్చు.

* **ప్రవర్తనాపరమైన చికిత్సలు:** కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (CBT) వంటి ప్రవర్తనా పరమైన చికిత్సలు వ్యసనం నుండి బయటపడటానికి సహాయపడతాయి.
* **విద్యా కార్యక్రమాలు:** వ్యసనం యొక్క నష్టాల గురించి అవగాహన కల్పించే విద్యా కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయి.
* **తల్లిదండ్రుల పర్యవేక్షణ, నియంత్రణ వంటి వ్యూహాలు:** తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని నియమాలు పెట్టడం మరియు వారి ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా వారిని ఈ వ్యసనం నుండి కాపాడవచ్చు.

ఈ వ్యూహాలను అమలు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆన్‌లైన్ ప్రవర్తనలను పెంపొందించుకోవచ్చు మరియు టీనేజర్లలో శ్రేయస్సును మెరుగు పరచడానికి సహాయపడే కొన్ని ముఖ్యమైన అంశాలను మనం ఇప్పుడు పరిశీలిద్దాం:

**ఎ) ఆన్‌లైన్‌లో సమయం వృధా చేసే అలవాట్లను గుర్తించడం**

ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడం వల్ల అనేక రకాల పనికిరాని అలవాట్లు ఏర్పడతాయి. ఈ ప్రవర్తనలను గుర్తించడమే ఆన్‌లైన్ సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి మొదటి అడుగు. సాధారణంగా సమయం వృధా చేసే కొన్ని అలవాట్లు:

1. అంతులేని స్క్రోలింగ్ మరియు అర్థంలేని బ్రౌజింగ్ స్పష్టమైన ఉద్దేశం లేకుండా సోషల్ మీడియాలో నిరంతరం స్క్రోల్ చేయడం గంటల

సమయం తీసుకుంటుంది. అధ్యయనాల ప్రకారం ఈ తరం రోజుకు దాదాపు ఏడు గంటలు మీడియాలో గడుపుతున్నారు. ఇది మీ ఉత్పాదకతను తగ్గిస్తుంది.

2. నిరంతరం నోటిఫికేషన్‌లను తనిఖీ చేయడం చదువుకునే సమయంలో స్మార్ట్‌ఫోన్ హెచ్చరికలు, సందేశాలు లేదా కాల్స్‌ను పదే పదే తనిఖీ చేయడం ఏకాగ్రతను, ఉత్పాదకతను తగ్గిస్తుంది. ముఖ్యంగా విద్యార్థులు దీని గురించి అవగాహన కలిగి ఉండాలి.
3. అనవసరమైన ఆన్‌లైన్ షాపింగ్ అవసరం లేని ఉత్పత్తులను బ్రౌజ్ చేస్తూ సమయం గడపడం ఆర్థిక సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి మీకు నిజంగా అవసరమైన వాటిని మాత్రమే కొనడానికి ప్రయత్నించండి
4. నిరుపయోగ ఆన్‌లైన్ చర్చలు క్రీడలు లేదా రాజకీయాలు వంటి అంశాలపై చర్చలలో పాల్గొనడం వ్యక్తిగత ఎదుగుదలకు దోహదం చేయదు, ఇది సమయం, శక్తిని వృధా చేస్తుంది. నిర్మాణాత్మకమైన చర్చల్లో పాల్గొనడం మంచిది.
5. డిజిటల్ కంటెంట్ యొక్క అధిక వినియోగం చాలా చిన్న వీడియోలను చూడటం లేదా వినోద కంటెంట్‌ను చూడటం శ్రద్ధ మరియు ఏకాగ్రతను తగ్గిస్తుంది. ఒక పరిమితిలో మాత్రమే వినోదాన్ని పొందండి.
6. ఉద్దేశ్య రహిత బ్రౌజింగ్ స్పష్టమైన లక్ష్యం లేకుండా యాదృచ్ఛిక లింక్‌లపై క్లిక్ చేయడం లేదా బహుళ ట్యాబ్‌లను తెరవడం వృధా సమయానికి దారితీస్తుంది. ఒక నిర్దిష్ట లక్ష్యం లేకుండా ఇంటర్నెట్‌ను ఉపయోగించకుండా ఉండండి.
7. విపరీతమైన ఆన్‌లైన్ గేమింగ్ ఆన్‌లైన్ గేమ్‌లు ఎక్కువ గంటలు ఆడటం ఉత్పాదక కార్యకలాపాల నుండి సమయాన్ని తీసుకుంటుంది. ఇది మీ భవిష్యత్తుకు ఉపయోగపడే సమయాన్ని కూడా వృధా చేస్తుంది.
8. వార్తల అధిక వినియోగం వివిధ మూలాల నుండి నిరంతరం వార్తా నవీకరణలను తనిఖీ చేయడం ఒత్తిడి మరియు సమాచార ఓవర్‌లోడ్‌కు కారణమవుతుంది. కాబట్టి ఒక పరిమితిలో మాత్రమే వార్తలను చూడండి.

### ఈ అలవాట్లను ఎలా అధిగమించాలి?

- ❋ ఆన్‌లైన్ సమయం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోండి.
- ❋ ఆన్‌లైన్ వినియోగాన్ని ట్రాక్ చేయడానికి ఉత్పాదకత సాధనాలను ఉపయోగించండి.
- ❋ పరధ్యానం తగ్గించడానికి సమయ పరిమితులను ఏర్పాటు చేయండి.

## బి) ఆన్‌లైన్ లెర్నింగ్, క్రియేటివిటీ మరియు ఆధ్యాత్మిక సేవలో లక్ష్యాలను నిర్దేశించడం

జ్ఞానాన్ని సంపాదించడానికి, సృజనాత్మకతను పెంపొందించడానికి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఇంటర్నెట్ ఒక శక్తివంతమైన సాధనం. దీనిని సమర్థవంతంగా ఉపయోగించడానికి, స్పష్టమైన, అర్థవంతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం చాలా ముఖ్యం.

### 1. దేవుని మార్గదర్శకత్వం కోరడం

లక్ష్యాలను నిర్దేశించే ముందు, జ్ఞానం కోసం ప్రార్థించండి (యాకోబు 1:5) మరియు ఆన్‌లైన్ కార్యకలాపాలు దేవుని సంకల్పంతో ఎలా సమలేఖనం అవుతాయో ఆలోచించండి.

- ❋ నా నైపుణ్యాలను దేవుని సేవలో, ఇతరులకు సహాయపడటానికి ఎలా ఉపయోగించగలను?
- ❋ ఏ అభ్యాసం లేదా సృజనాత్మక రంగాలలో నేను ఆధ్యాత్మికంగా మరియు ఆచరణాత్మకంగా ఎదగడానికి సహాయపడతాయి?

### 2. స్మార్ట్ లక్ష్యాలను కలిగియుండడం (నిర్దిష్టమైన, కొలవదగిన, సాధించగలిగిన, సముచితమైన, సమయ పరిమితి కలిగిన)

- ❋ **ఆన్‌లైన్ లెర్నింగ్ లక్ష్యాలు**
  - ఉడెమీ (Udemy), కోర్సెరా (Coursera) లేదా లోగోస్ బైబిల్ సాఫ్ట్‌వేర్ (Logos Bible Software) వంటి ప్లాట్‌ఫారమ్‌లలో కోర్సుల్లో నమోదు చేసుకోండి.
  - ది బైబిల్ ప్రాజెక్ట్ (The BibleProject), ఆర్.

సి. స్ప్రౌల్ (R.C. Sproul) మరియు జాన్ పైపర్ (John Piper) వంటి క్రిస్టియన్ పోడ్‌కాస్ట్‌లు, యూట్యూబ్ ఛానెల్‌లను అనుసరించండి.

- ట్రెల్లో (Trello) లేదా నోషన్ (Notion) వంటి గోల్-సెట్టింగ్ సాధనాలను ఉపయోగించి పురోగతిని ట్రాక్ చేయండి.
- సామెతలు 1:5 - "జ్ఞానవంతులు విని నేర్చుకోవడం అభివృద్ధి చేసుకొందురు."

❋ **పరిచర్యలో సృజనాత్మకత**

- ఆది 1:1 - "ఆదియందు దేవుడు భూమ్యా కాశములను సృష్టించెను"
- సృజనాత్మకత దేవుని బహుమానం మరియు విశ్వాసాన్ని పంచుకోవడానికి, ఇతరులను ప్రోత్సహించడానికి రచన, సంగీతం, డిజిటల్ మీడియా, విజువల్ ఆర్ట్స్ ఉపయోగించవచ్చు.

### సి) సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మరియు ఆఫ్‌లైన్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి వ్యూహాలు

ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ యాక్టివిటీస్ మధ్య సమతుల్యతను కాపాడుకోవడానికి సమయ నిర్వహణ చాలా అవసరం. మన జీవితంలో సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చూద్దాం.

#### 1. సమయాన్ని దేవుడిచ్చిన వరంగా అర్థం చేసుకోవడం

సమయం చాలా విలువైనది. వృథా చేయడం అంటే దేవుడు మనకు ఇచ్చిన గొప్ప వనరును నిర్లక్ష్యం చేయడమే. సమయాన్ని తెలివిగా ఉపయోగించడం ద్వారా ఆధ్యాత్మికంగా, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అభివృద్ధి చెందవచ్చు. ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఒక బాధ్యతగా భావించాలి.

#### 2. బైబిల్ ప్రకారం ప్రాధాన్యతలు నిర్ణయించుకోవడం

- మీ జీవితంలో ముఖ్యమైన మొదటి 5 ప్రాధాన్యతలను ఒక కాగితంపై రాయండి. మీ దినచర్య వాటిని ప్రతిబింబించేలా చూసుకోండి. అంటే, మీరు రోజూ చేసే పనులు మీ ముఖ్యమైన లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో చూసుకోండి.
- ఆఫ్‌లైన్ కార్యక్రమాలను షెడ్యూల్ చేయడానికి ఒక ప్రణాళికను ఉపయోగించండి. ముఖ్యమైన పనులను నిర్లక్ష్యం చేయకుండా ఇది కాపాడు తుంది. ప్రణాళిక ప్రకారం పనులు చేయడం వలన సమయం వృథా కాదు.

| ప్రాధాన్యత | ఉదాహరణలు | బైబిలు ఆధారం |
|---|---|---|
| దేవుడు & ఆధ్యాత్మిక అభివృద్ధి | ప్రార్థన, బైబిల్ అధ్యయనం, ఆరాధన | మత్తయి 22:37 |
| పని & సేవ | చర్చిలో సేవ చేయడం, కెరీర్ | కొలస్సీ 3:23 |

బైబిల్ ప్రకారం ప్రాధాన్యతలు నిర్ణయించుకోవడం

#### 3. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ కార్యకలాపాలకు హద్దులు నిర్ణయించడం

- చదువుకునేటప్పుడు, ప్రార్థన చేసేటప్పుడు లేదా కుటుంబంతో గడిపే సమయంలో నోటిఫికేషన్లను ఆఫ్ చేయండి. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
- భోజనం చేసేటప్పుడు, ప్రార్థనలు చేసే సమయంలో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించకుండా ఒక సమయాన్ని కేటాయించండి.
- Digital Wellbeing, Forest లేదా Freedom వంటి అప్లికేషన్లను ఉపయోగించి పరధ్యానాన్ని తగ్గించండి.

ఉదాహరణ: ఒకవేళ ఆన్‌లైన్ పని ఉదయం 8 గం॥ నుండి 12 గం॥ వరకు ఉంటే, ఆ తరువాత ఆఫ్‌లైన్ సమయాన్ని చక్కగా గడపడానికి నోటిఫికేషన్లు ఆఫ్ చేసి, ఫోన్‌ను వేరే గదిలో ఉంచాలి.

ఐసెన్‌హోవర్ నిర్ణయ మాత్రిక (Eisenhower

Matrix) పద్ధతిని ఉపయోగించి, ముఖ్యమైన మరియు తక్కువ ప్రాధాన్యత కలిగిన పనులను వర్గీకరించండి.

⁕ **ఆత్మ పరిశీలన చేసుకోండి**

నేను నా సమయాన్ని సద్వినియోగం చేస్తున్నానా? అని క్రమం తప్పకుండా ప్రశ్నించుకోండి.

| ఐసెన్‌హోవర్ నిర్ణయ మాత్రిక (Eisenhower Decision Matrix) | అత్యవసరం (Urgent) | అత్యవసరం కాదు (Not Urgent) |
|---|---|---|
| ముఖ్యమైనది (Important) | వెంటనే చేయండి (Do First) | తరువాత చేయండి (Decide) |
| ముఖ్యమైనది కాదు (Not Important) | ఇతరులకు అప్పగించండి (Delegate) | తొలగించండి (Delete) |

### 4. విశ్రాంతి దినాన్ని ఏర్పాటు చేసుకోవడం

- ఆదికాండము 2:2–3 ప్రకారం దేవుడు ఏడవ రోజున విశ్రాంతి తీసుకున్నాడు. దీనిని బట్టి మనం కూడా విశ్రాంతి తీసుకోవాలి.
- మార్కు 2:27 లో "విశ్రాంతి దినము మనుష్యుల కొరకు ఏర్పరచబడెను'' అని చెప్పబడింది. అంటే విశ్రాంతి తీసుకోవడం మన అవసరం.
- ప్రతివారం ఒక రోజును పని నుండి మరియు ఆన్‌లైన్ పరధ్యానాల నుండి దూరంగా ఉంచండి. ఆ రోజును ఆధ్యాత్మిక, శారీరక పునరుద్ధరణ కోసం ఉపయోగించండి.

### ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ జీవితాన్ని సమతుల్యం చేయడానికి ఉపయోగకరమైన చిట్కాలు

⁕ **డిజిటల్ సమయ పరిమితులను సెట్ చేయండి:** ఐఫోన్‌స్క్రీన్ టైమ్ లేదా ఆండ్రాయిడ్ డిజిటల్ వెల్‌బీయింగ్ సెట్టింగ్లను ఉపయోగించి ఆన్ కార్యకలాపాలను పర్యవేక్షించండి.

⁕ **రోజును ఆఫ్‌లైన్‌లో ప్రారంభించండి మరియు ముగించండి**

పరికరాలను ఉపయోగించే ముందు ప్రార్థన, వ్యాయామం మరియు అల్పాహారంతో రోజును ప్రారంభించండి. అలాగే పడుకునే ముందు కూడా ఫోన్ చూడకుండా ప్రశాంతంగా నిద్ర పోయేలా చూసుకోండి.

మనల్ని మనం ప్రశ్నించుకోవడం ద్వారా మన తప్పులను తెలుసుకొని సరిదిద్దుకోవచ్చు.

ఈ వ్యూహాల ద్వారా, మన సమయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చు. తద్వారా ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ జీవితాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ, ఆధ్యాత్మికంగా, వ్యక్తిగతంగా మరియు వృత్తిపరంగా అభివృద్ధి చెందవచ్చు.

### ముగింపు

యువత ఎదుగుదలకు సమయం ఒక కీలకమైన వనరు. దానిని సద్వినియోగం చేసుకోవడం అభ్యాసం, సృజనాత్మకత, విశ్వాసాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ జీవితాల మధ్య సమతుల్యతను కాపాడు కోవచ్చు. ఈ లక్ష్యాలను సాధించడానికి కొన్ని వ్యూహాలను అనుసరించడం ద్వారా యువత ఉత్పాదకమైన అలవాట్లను పెంపొందించుకోవచ్చు, విశ్వాస సంబంధిత సమూహాలతో అనుబంధం కలిగి ఉండవచ్చు మరియు తమ ఆన్‌లైన్ ఉనికిని అర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు.

### రిఫరెన్స్

1. https://pmc.ncbi.nlm.nih.gov/articles/PMC11594359/

– డా॥ అనిల్ అబ్రహాం
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ,
నాగార్జున గవర్నమెంట్ కాలేజ్, నల్గొండ

# దేవుడిచ్చిన సాటియైన సహకారి



అది మే 28, 2004. నా భార్య ఉమ క్యాన్సర్ వ్యాధితో మహిమలోకి పిలువబడింది. నా ప్రపంచం మొత్తం చిన్నాభిన్నం అయ్యింది. నా యిల్లు కూలిపోయింది. నా జీవితం అతలాకుతలం అయ్యింది. నాకు పిల్లలు లేరు, ఆదరించేవారు కూడా లేరు అందుకే నన్ను కూడా తీసుకెళ్ళమని దేవున్ని అనేకసార్లు ప్రార్థించాను. సి.యస్.లూయిస్ వ్రాసిన "అ గ్రీఫ్ అబ్ సర్వ్‌డ్" (A Grief Observed) అనే పుస్తకానికి ముందుమాటలో మెగ్దలీన్ ఎల్ ఇంగిల్ ఇలా వ్రాసింది "ప్రియమైన వారి మరణం హృదయాన్ని కోసివేస్తుంది". తను నాకు దేవుడిచ్చిన సాటియైన సహకారి. నా ఎముకలో ఎముక... నా మాంసములో మాంసము. ఆమె జ్ఞాపకాలు నన్ను వెంటాడుతునే వున్నాయి.

## ఉమతో నా పరిచయం, వివాహం

నాకు బాగా గుర్తుంది. నేను ఉమని యుఇయస్ఐ ఆఫీసులో మొదటిసారి కలుసుకున్నాను. ఆమె ప్రభువును 1967లో తెలుసుకొంది. అదే సంవత్సరం నేను కూడా ప్రభువును తెలుసుకున్నాను. తను ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి వచ్చింది. నేను ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నుంచి వచ్చాను. నా హింది భాష ఆమెకు వచ్చు, ఆమె ఒరియా భాషను నేను అర్థం చేసుకోగులను కాని మాట్లాడలేను. తను బియస్సీ, బిఇడి చదివింది. నేను బిఎ చదివాను. ఓ... క్షమించండి నా పేరు చెప్పలేదు కదా! నా పేరు రిచర్డ్ మషి. మా అమ్మకి నేను ఒక్కడినే బిడ్డని, పైగా నేను పుట్టిన సమయానికి నా తండ్రి కూడా ఈ లోకాన్ని విడిచారు. ఉమ తన తల్లితండ్రుల ఏడుగురు సంతానంలో ఒకరు. నేను స్థానికంగా ఉండే విశ్వాసుల అసెంబ్లీకి వెళ్ళేవాడను, తనేమో బాప్టిస్ట్ సంఘానికి చెందింది. ఇన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికి 1978 నుంచి మేము సంతోషకరమైన వివాహ జీవితం గడిపాము.

తన స్థితిని బట్టి సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న ఎవరైనా ఒక వ్యక్తిని పెళ్ళి చేసుకొని కార్లు, బంగళాలు, నౌకర్లు కలిగి జీవించి ఉండవచ్చు. అయితే తానే దేవుని చిత్తానికి విధేయత చూపించి సాధారణమైన యుఇయస్ఐ స్టాఫ్ వర్కర్ అయిన నన్ను వివాహం చేసుకొంది. అందరికి ఉన్నట్లే మాకు మనస్సు నొచ్చుకోవడాలు, తలనొప్పులు ఉండేవి, అయినప్పటికీ వివాహ జీవితం యొక్క మాధుర్యాన్ని చూసాము.

## ఉమ వ్యక్తిత్వం

ఉమ ఏ విషయం గురించైనా డొంకతిరుగుడు లేకుండా నేరుగా మాట్లాడేది. తన కమిట్‌మెంట్, కన్‌విక్షన్స్ నుంచి ప్రక్కకు తప్పుకునేదికాదు. తను మాట్లాడాల్సిన సమయంలో, విషయాల్లో తప్పకుండా మాట్లాడేది. తన ఎదురుగా ఉన్నది ఎంతటి వారైనా తప్పించుకునేది కాదు. రెండు నాల్కల ధోరణి ఆమెకు నచ్చదు. ఎవరి పక్షం

వహించేదికాదు. మనుష్యులను సంతోషపెట్టడానికి ప్రాధాన్యత ఇచ్చేదికాదు. ప్రజల అభిప్రాయాలు, వ్యక్తిత్వ పోకడల కన్నా దేవుని చిత్తమే తనకు ప్రాధాన్యం. ఇతరులతో కలిసి గాసిప్స్ మాట్లాడటం తనకు అస్సలు నచ్చదు. అట్లని తాను ఉప్పొంగి పోయే రకం కాదు. తనది తప్పని తెలిసిన వెంటనే చిన్న వారైనా క్షమాపణ అడిగేది. ఎంత ప్రేమ, ఆప్యాయతలు కలిగి చాలా వినయంగా జీవించేది.

### దేవునితో ఉమ సహవాసం (క్వయిట్‌టైమ్)

ఉదయాన్నే మౌనధ్యాన సమయంలో ప్రభువుతో గడపటానికి ఉమ అత్యంత ప్రాధాన్యత నిచ్చేది. బ్రేక్ ఫాస్ట్, మనుషులు, కార్యక్రమాలు, వార్తాపత్రికలు, ఇటువంటివన్నీ కూడా మౌనధ్యానం అయిపోయాకే. 26 సంవత్సరాల మా వివాహ జీవితంలో ఒక్కసారి కూడా తాను మౌనధ్యానం మరచి పోవడం, ప్రభువుతో గడపకపోవడం నేనెప్పుడూ చూడలేదు. ప్రతిరోజు మా కుటుంబ ప్రార్థనా సమయంలో మౌనధ్యానంలో దేవుడు మాతో ఏమి మాట్లాడాడో పంచుకొనేవారం. అయితే తాను చనిపోవడానికి కొద్దిరోజుల ముందర తాను మౌనధ్యానం చాలా రోజుల నుంచి చేసుకోవడం లేదని ఎంతో విచారవదనంతో చెప్పింది. (చాలా నెలలు ఉమ క్యాన్సర్ వ్యాధితో హాస్పటల్‌లోనే ఉండి అక్కడే చనిపోయింది) 'దేవుడు నీవు ఉన్న పరిస్థితి అర్థం చేసుకుంటాడు, పైగా నీవు వినగల్గేలా ప్రతిరోజు నేను బైబిల్ చదువుతున్నాను కదా అధైర్యపడవద్దు" అని తనకు ధైర్యం చెప్పాను. అది తన మనస్సుకు హాయినిచ్చింది.

### ఇల్లు, ఆహారం పట్ల ఉమ వైఖరి

ఉమ ఇంటిని శుభ్రంగా, అందంగా ఉంచడానికి ఇష్టపడేది. అతిథుల్ని ఎప్పుడైనా ఆహ్వానించే విధంగా ఇంటిని తీర్చిదిద్దేది. విందు భోజనం ఎంత శ్రద్ధగా, రుచిగా వండుతామో అంతే శ్రద్ధతో ప్రతిపూట రకరకాల కూరలతో భోజనం వండేది. మాకు పెళ్ళైన తర్వాత చేయి తిరిగిన ఆమె వంటకం చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఇక ఆ తరువాత వంట విషయం పూర్తిగా ఆమెకి వదిలేశాను. ఇప్పుడు నాకనిపిస్తుంది, మా ఆహారపు అలవాట్లు వేరు వేరుగా ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదా అని. కాని దేవుడు తన ప్రణాళికలో ఈ విషయాన్ని చూచుకున్నాడు. నేను నా ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆమె ఏమి వంటచేసినా నాకు చాలా నచ్చేది, క్యాబేజితో కలిపి చేప తలకూర తప్ప (ఇది ఒరియా ప్రజల ఇష్టమైన వంటకం). కంగారు పడకండి తానెప్పుడూ నన్ను ఆ వంటకం తినమని బలవంతం చేసేదికాదు. ఆమె వంటలను నేను తరచు మెచ్చుకొనేవాడిని. అది ఆమెకు తెలియజెప్పేవాడిని. అంతేకాదు తనకు వంటలో సహాయం చేసేవాడిని. వంటగదిలో ఆమె మాస్టర్ నేను అసిస్టెంటుని.

### డబ్బు పట్ల ఉమ దృక్పథం

డబ్బు, గౌరవ మర్యాదలు, అధికారం, ఉన్నత స్థానం, సుఖాలు, సౌకర్యాల వంటి వాటి వెంబడి ఉమ ఎప్పుడూ వెళ్ళలేదు. మోషే వలే తాను ఈ లోక జ్ఞానము, సిరి సంపదలు, సుఖాలు తృణప్రాయంగా ఎంచుకొంది (హెబ్రీ 11:24-28). పౌలు లాగ లోకం, తనకు, తను లోకానికి సిలువవేయబడింది (గలతీ 6:14). డబ్బు విషయంలో దేవున్ని గౌరవించేది. డబ్బుని వాడేముందు బడ్జెట్ వేయాలి, అందులో మొట్టమొదటిగా దశమభాగం ప్రక్కకు తీయాలని చెప్పేది. ఎన్ని అవసరాలు ఉన్నా దశమ భాగం క్రమం తప్పకుండా, నమ్మకంగా ఇవ్వాలని, దాన్ని ఇవ్వడంలో ఆలస్యం చేయడం, వాయిదా వేయడం చేయకూడదని గట్టిగా చెప్పేది. మా చేతులలోకి నెల జీతంరాగానే, త్యాగంతో, ఉదార స్వభావంతో, నమ్మకంగా యుఇయస్‌ఐకి ఇచ్చిన వారిగురించి కలిసి దేవునికి స్తుతులు చెల్లించి, ప్రార్థించేవాళ్ళం.

మాకున్న బడ్జెట్‌లోనే సర్దుకోవాలని తన అభిప్రాయం. అప్పుచేయడం, ఆఫీసులో అడ్వాన్ తీసుకోవడం వంటి వాటిమీద తనకు నమ్మకంలేదు. వస్తువులు వాయిదా పద్దతిలో కొనుగోలుచేయడం ఆమెకు ఇష్టంలేదు.

### పరిచర్య పట్ల ఉమ దృక్పథం

ఉమ దేవున్ని హృదయపూర్వకంగా సేవించింది (కొలస్సీ 3:23). తను ఏంచేసినా తన పూర్ణశక్తితో చేసేది (విలాప 9:10). అంతేకాదు తను

చేసిందంతా దేవునికి మహిమ తెచ్చే విధంగా చేసింది (1 కొరింథీ 10:31). ఉమ శరీరం చాలా బలహీనంగా ఉండేది. అయినప్పటికీ తన శరీరాన్ని సజీవయాగంగా దేవునికి అర్పించింది (రోమా 12:1). పరిచర్య కోసం జీవితంలో ఎలాంటి త్యాగం చేయడానికైనా సిద్ధపడేది. ఎండాకాలంలో ఎర్రటి ఎండలో గర్ల్స్ బైబిల్ స్టడీ తీసుకోవడానికి తను వెళ్తూ ఉండేది. ఎక్కడైతే పరిచర్యలో తన అవసరం ఉందో అది ఎంత దూరమైనా ఎండాకాలంలో గంటలకొద్దీ ప్రయాణం చేయాల్సివచ్చినా తప్పకుండా వెళ్ళేది. కొన్ని సార్లు తనుకున్న కమిట్‌మెంట్‌ను బట్టి తాను వెలచెల్లించాల్సి వచ్చేది.

నాది చంచల వ్యక్తిత్వం, తనది అచంచల మనస్తత్వం. అన్నిటికన్నా ముందుగా దేవుని చిత్తానికి ప్రాధాన్యత ఇవ్వడం, ఎటువంటి పరిస్థితులలోనైనా దేవుని చిత్తానికి లోబడి ధైర్యంగా నిలబడడం నేను ఆమె దగ్గర నేర్చుకొన్నాను. ఒకసారి దేవుని చిత్తం కనుగొనిందంటే అంతే, స్నేహితులైనా, శత్రువులైనా, ఆఖరికి భర్తయినా, దానినుంచి ఆమెను మార్చలేరు. దీనర్థం తాను భర్తకు లోబడదనికాదు. భార్యలు తమ భర్తలకు లోబడి ఉండాలని తను నమ్మేది, ఇతరులకు చెప్పేది (ఎఫెసీ 5:22).

## ముగింపు

ఉమ గురించి చెప్పాలంటే ఇంకా చాలా విషయాలు ఉన్నాయి. ఒక వ్యక్తి జీవించి ఉన్నప్పుడు మనకు వాళ్ళలోని బలహీనతలు, పొరపాట్లు, వైఫల్యాలు, తప్పిదాలు గురించే ఎక్కువగా ధ్యాస కలిగి ఉంటాము. కాని ఎప్పుడైతే వాళ్ళు మనల్ని విడిచి వెళ్ళారో అప్పుడు వాళ్ళు మనకు ఎంత ప్రియులో, వాళ్ళు లేకుండా మన జీవితం ఎంత అర్థరహితమో తెలుస్తుంది. ఉమ ఇప్పుడు లేదు. నేనేం కోల్పోయానో నాకర్థం అవుతోంది. 26 సంవత్సరాల పాటు ఉమ తన జీవితాన్ని, పరిచర్యను నాతో పంచుకొన్నందుకు కన్నీటితో దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను. ఆమె లేని లోటుని నేను అనుభవిస్తున్నాను, అంతే కాదు ఒకవేళ దేవుడు తన కృపలో తనని మళ్ళీ నాకోసం ఈ లోకానికి పంపిస్తానంటే ఏం ఇవ్వడానికైనా నేను సిద్ధం. తను త్వరలో ఈ లోకం విడిచిపోతుంది అని తెలిసి ఉంటే ఆమెని మరి ఎక్కువగా ప్రేమించేవాడిని (1పేతురు 1:22; యోహాను 13:34,35), మరి ఎక్కువగా ఆదరించేవాడిని (రోమా 15:7), మరి ఎక్కువగా ప్రోత్సహించేవాడిని (హెబ్రీ 3:13; 1 థెస్స 4:18), మరి ఎక్కువగా తన కోసం ప్రార్థించేవాడిని తనతో కలిసి ప్రార్థించేవాడిని (యాకోబు 5:16), మరి ఎక్కువగా తన భారం, బాధ్యతలు మోసేవాడిని (గలతీ 6:2), నాకన్నా ఎక్కువగా తనను గౌరవించేవాడిని (రోమా 12:10). ఇంకా ఎక్కువగా ఆమెకు నా సమయాన్ని ఇచ్చి ఉండవచ్చు, ప్రేమ చూపించి ఉండవచ్చు, స్పష్టంగా కమ్యూనికేట్ చేసి ఉండవచ్చు. కానీ ఇప్పుడు నాకు ఆ అవకాశం లేదు. సమయం మించిపోయింది. అదిప్పుడు నా చేతుల్లో లేదు. కేవలం ఆమె జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. ఇప్పుడు పశ్చాత్తాపం, వైఫల్యాలు, జారిపోయిన అవకాశాలే మిగిలాయి.

ఉమ గురించి నేను ఆలోచిస్తున్నప్పుడు సామెతలు 31వ అధ్యాయంలో గుణవతియైన భార్య జ్ఞప్తికి వస్తుంది. ఉమ ఉన్నతమైన సౌశీల్యం కల భార్య. ఆమె ముత్యముకంటే అమూల్యమైనది. ఆమె విలువను నేను ఇప్పుడు గుర్తించినంతగా తను జీవించివున్నప్పుడు గుర్తించి ఉంటే ఎంత బాగుండు. ఆమె రత్నము వంటిది. ఎల్లప్పుడు నా క్షేమమే కోరేది. ఆమె మీద నాకు పూర్తి భరోసా ఉండేది, ఏది కొదువ ఉండేది కాదు. తన భర్త, మరియు అందరి ప్రశంసలకు ఆమె అర్హురాలు. నిజముగా ఉమ దేవునికి క్రీస్తు సువాసనయై ఉండినది (లేవి 1:9,13,17; 2 కొరింథీ 2:15).

**(Source: "Uma, A Pleasing Aroma", by Richard Masih)**

(ఈ జీవితగాథ విద్యార్థి జ్వాల, ఏప్రిల్ 2012 సంచికలో ప్రచురించబడింది)

– డా॥వై.వి.ఆర్. ప్రసన్నకుమార్, కరుణ, సూర్యాపేట



# ఎస్తేరు

## అందమైన వ్యక్తిత్వ గుణ లక్షణాలు కలిగిన మహిళ

బైబిల్లో ఉన్న విశిష్టమైన వ్యక్తుల్లో ఎస్తేరు ఒకరు. ఆమె జీవితం వినయం, విధేయత, మరియు సౌమ్యతను ప్రతిబింబిస్తుంది. అనాథగా ఉన్న ఆమె, తన సరళమైన, విధేయత కలిగిన స్వభావం రాణిగా అవతరించడంలో కీలక పాత్ర పోషించాయి.

### మొర్దెకై, ఎస్తేరుల నేపథ్యం

యూదా రాజైన యెకోన్యాతో బబులోనుకు చెరగొనిపోబడిన వారిలో యూదుడైన మొర్దెకై కూడా ఒకడు. ఎస్తేరు అని పిలువబడే తన పినతండ్రి అబీహాయిలు కుమార్తె అయిన హదస్సాను పెంచి పెద్ద చేశాడు. ఆమె రూపంలోను, ముఖంలోను అందమైన వ్యక్తి. ఆమెకు తండ్రీ, తల్లీ లేరు. ఆమె తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత, మొర్దెకై ఆమెను తన కుమార్తెగా స్వీకరించాడు.

### రాజభవనంలో ఎస్తేరు

రాజైన అహష్వేరోషు ఒక ప్రకటన జారీ చేయగా, చాలా మంది యౌవన స్త్రీలు షూషను కోటకు తీసుకురాబడ్డారు. వారంతా హేగే సంరక్షణలో ఉంచబడ్డారు. ఆ యువతుల్లో ఎస్తేరు కూడా ఉంది. ఆమె హేగే దృష్టిలో దయను పొందింది (ఎస్తేరు 2:9).

ఎస్తేరు అందరికన్నా భిన్నంగా ప్రవర్తించింది. ఇతర యువతులు రాజభవనం యొక్క అందం, అలంకార వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, విలాసవంతమైన భోజనాలపై మక్కువ చూపగా, ఎస్తేరు మాత్రం ప్రశాంతంగా, సౌమ్యంగా ఉండేది. ఆమె తన సహజమైన విధేయత స్వభావాన్ని ప్రదర్శించి, హేగే దృష్టిలో విశేషమైన కృపను పొందింది.

### వినమ్రత స్వభావం

ప్రతి ఒక్కరూ తమ జీవితంలో విజయం సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటారు. అయితే, ఈ ప్రయాణంలో మనకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఎంతగానో తోడ్పడతాయి. వాటిలో ముఖ్యమైనది "వినమ్రత". వినమ్రత అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యత ఏమిటి? అనే విషయాలను మనం ఇప్పుడు తెలుసుకుందాం.

వినమ్రత అనేది ఒక వ్యక్తి యొక్క గొప్ప వ్యక్తిత్వ లక్షణం. ఇది శాంతంగా ఉండడం, సులభంగా నియంత్రించబడడం, నడిపించబడడానికి ఇష్టపడడం, సులభంగా నిర్వహించబడడం లేదా నిర్వహించడం, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండడం, వినయంగా ఉండడం, బోధించదగినదిగా ఉండడం, అంతర్గత తిరుగుబాటు లేకుండా ఉండడం వంటి లక్షణాలను సూచిస్తుంది. ఎస్తేరు 2:9, 10, 15 మరియు 20 వచనాల ప్రకారం, ఎస్తేరులో మనం ఈ అందమైన వ్యక్తిత్వ లక్షణాన్ని చూడవచ్చు.

### రాజభవనంలో ఎస్తేరు చర్యలు

ఎస్తేరు రాజు దగ్గరకు వెళ్ళవలసిన సమయం వచ్చినప్పుడు, హేగే చెప్పిన దానికంటే ఆమె ఏమీ అడగలేదు (2:15). దీని కారణంగా, ఎస్తేరును చూసిన వారందరి దృష్టిలో ఆమెకు దయ లభించింది. ఆమె 12 నెలల పాటు పరిమళ క్రియలు సంపూర్ణమగు సమయంలో తన వినమ్రత స్వభావాన్ని ప్రదర్శించింది. తన వినమ్రత కారణంగా, ఆమె తనను తాను నియంత్రించుకుంది మరియు అదనపు ఆభరణాల కోసం అడగలేదు, తద్వారా ఆమె వినయపూర్వకమైన స్వభావాన్ని మరింత ప్రదర్శించింది.

రాజు ఎస్తేరును ప్రేమించాడు మరియు ఆమెకు కన్యలందరి కంటే ఎక్కువ అనుగ్రహం మరియు దయ లభించాయి. అతను వష్తి స్థానంలో ఆమెను రాణిగా పట్టాభిషేకం చేశాడు.

రాణిగా ఉన్నప్పటికీ, ఎస్తేరు తన బంధువులను లేదా తన ప్రజలను వెల్లడించలేదు. మొర్దెకై సంరక్షణలో ఉన్నప్పుడు ఎలా అయితే అతని సూచనలను పాటించేదో, అదే విధంగా ఇప్పుడు కూడా అతని సూచనలను అనుసరించింది (2:10, 20). ఇది ఆమె వినమ్రత స్వభావాన్ని కొనసాగిస్తూ చూపించింది.

### ముగింపు

ఎస్తేరు రాజభవనంలో ఉన్నప్పుడు, రాజుతో సమావేశమైనప్పుడు, రాణి అయిన తర్వాత కూడా ఒక అందమైన, వినమ్రత స్వభావాన్ని ప్రదర్శించింది. దేవుడు తెర వెనుక ఉండి ఆమె వినమ్రతను గౌరవించాడు.

క్రైస్తవ అమ్మాయిలుగా, స్త్రీలుగా మనం తరచుగా మన చదువు, నైపుణ్యాలు, ఉద్యోగాలు, కుటుంబ నేపథ్యం కారణంగా దేవునికి లోబడడానికి, మన భర్తలకు విధేయత చూపడానికి కష్టపడతాం. విధేయత తర్వాత వచ్చే ఉన్నతమైన లక్షణమే వినమ్రత. మన భర్తలు, పెద్దలు చెప్పినట్లు చేయడానికి ప్రయత్నిద్దాం. ఇంట్లో రాణిలా గౌరవించబడాలని కోరుకునే ఏ స్త్రీ అయినా ఈ అందమైన వినమ్రత అనే వ్యక్తిత్వ లక్షణాన్ని అలవాటు చేసుకోవాలి. మనలో తిరుగుబాటు స్వభావం లేకుండా ఈ లక్షణాన్ని కలిగి ఉండాలని దేవుని అడుగుదాం.

ఈ అందమైన వినమ్రత అనే లక్షణాన్ని పెంపొందించుకోవడానికి, స్వీకరించడానికి క్రైస్తవ అమ్మాయిలకు, మహిళలకు మన ప్రభువు సహాయం చేయును గాక!

– త్రివేణి శ్రీను,
రామాంతపూర్ జోన్, హైదరాబాద్

* * * * * *





# పుస్తకాలు రాయని ప్రపంచ ప్రఖ్యాత రచయిత!

తన జీవిత కాలంలో పుస్తకాలు రాయకుండానే ప్రపంచ ప్రఖ్యాత రచయితగా గుర్తించబడిన వ్యక్తి ఎవరో మీకు తెలుసా?

ఆ వ్యక్తి స్కాట్లాండ్ దేశంలో 1874లో జన్మించిన ఆస్వాల్డ్ ఛాంబర్స్. తన యవ్వనంలోనే ప్రభువును నమ్ముకున్న ఆయన, 21 సంవత్సరాల వయసులో ప్రభువు పరిచర్యకు పిలుపును అందుకుని, సువార్త సేవకు సమర్పించుకున్నాడు. బ్రిటన్, అమెరికా, జపాన్ దేశాల్లో సువార్తను ప్రకటించాడు. 1910లో బిడ్డి హొబ్స్ అనే విశ్వాసిని వివాహం చేసుకున్నాడు. ఆమె వృత్తిరీత్యా స్టెనోగ్రాఫర్.

తదుపరి, బ్రిటన్‌లో వ్యక్తిగత క్రైస్తవ జీవనానికి ప్రాధాన్యతనిచ్చే ఒక బైబిల్ కళాశాలను స్థాపించాడు. ఈ కళాశాలను విశ్వాసం, ప్రార్థన ద్వారా నడిపాడు. ఒకరోజు, తన స్నేహితుడు ఆ కళాశాలకు భారీ విరాళం ఇవ్వబోగా, "నీ విరాళం వలన బహుశా దేవుడు కోరుకున్న దానికంటే, ఎక్కువ కాలం ఈ కళాశాల నడుస్తుంది" అని చెప్పి, ఆ విరాళాన్ని సున్నితంగా తిరస్కరించాడు.

1915లో మొదటి ప్రపంచ యుద్ధం వలన ఆ కళాశాల మూతబడింది. వెంటనే దేవుని పిలుపును అందుకుని, బ్రిటన్ నుండి ఈజిప్ట్‌కు వెళ్లి యుద్ధక్షేత్రంలో పరిచర్య చేశాడు. అయితే, అక్కడే 1917లో, అపెండిసైటిస్ అనే ఆరోగ్య సమస్య ప్రాణాంతకంగా మారి, 43 సంవత్సరాల వయసులోనే ప్రభువు సన్నిధిని చేరాడు.

తన జీవిత కాలంలో ఆయన ఎన్నో పుస్తకాలు రచించలేదు. కానీ, ఆయన మరణం తర్వాత, ఆయన భార్య బిడ్డిని అనేకమంది "నీ భర్త ప్రసంగాలను పుస్తకాలుగా మలిచి ప్రచురించు" అని ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహమే, "పుస్తక ప్రచురణ, తన కోసం ప్రభువు ఏర్పాటు చేసిన పని" అని బిడ్డి గ్రహించడానికి సహాయపడింది. స్టెనోగ్రాఫర్ అయిన బిడ్డి, తన వృత్తి నేపథ్యం వలన, భర్త యొక్క ప్రసంగాల నోట్స్‌ను చక్కని రచనలుగా మలిచింది. ఆ ప్రసంగాలే 30 పుస్తకాలుగా ప్రచురించబడ్డాయి. వాటిలో భాగమే "My Utmost for His Highest" అనే ప్రసిద్ధ పుస్తకం. ఇది నేటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్న పుస్తకం.

ఈ పుస్తకం గురించి, నేటి ప్రముఖ బోధకులలో ఒకరైన వారెన్ వీర్స్‌బీ ఏమన్నారంటే: "ఈ పుస్తకం అర్థం కావాలంటే, క్రైస్తవులుగా మనం పరిపక్వత లోనికి ఎదగాలి... ఈ పుస్తకం చదివి నప్పుడల్లా, నేను మరిచిపోయిన రత్నాలాంటి అమూల్య సత్యాలు నన్ను పలకరిస్తాయి."

ఆస్వాల్డ్ ఛాంబర్స్ భార్య ఆయన జీవితాన్ని పుస్తకాలుగా మలిచి ఉండకపోతే, ఆయన జీవితం మరియు వారసత్వం చాలా తక్కువ పరిధిలోనే ఉండిపోయేవి. పుస్తకాలు ఆ పరిధులన్నిటినీ అధిగమించడానికి దోహదపడ్డాయి. పుస్తకాల వలననే ఆయన చనిపోయిన 100 సంవత్సరాల తర్వాత కూడా, ఆయన జీవితం మరియు వారసత్వం మనల్ని ప్రోత్సహించి, ప్రభువు కోసం జీవించడానికి పురికొల్పుతున్నాయి.

పుస్తకాలే, ఆయన ప్రభువుకు చేసిన పరిచర్య ప్రభావాన్ని నేటికీ సజీవంగా ఉంచాయి. అందుకే పుస్తకాలు చదువుదాం. పుస్తక రచనను ప్రోత్సహిద్దాం. పుస్తకాలు రాసే కృప ప్రసాదించమని ప్రభువును వినమ్రంగా వేడుకుని, ఆయన మహిమకై పుస్తకాలు రాయడానికి సమర్పించుకుందాం.

– సందీప్ రాజ్ లంక
జేఏన్‌టీయూ జోన్, రంగారెడ్డి



# బైబిల్ స్టడీ: విశ్వాసపు లోతుల్లోకి ప్రయాణం (లూకా 5:1-11)

ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రత్యేకమైన మలుపు ఉంటుంది. ఒక సాధారణ వ్యక్తి అసాధారణమైన జీవితాన్ని గడపడానికి దేవుడు పిలుపునిచ్చే సందర్భం అది. లూకా సువార్తలోని 5వ అధ్యాయం 1 నుండి 11 వచనాల వరకు మనం అలాంటి ఒక అద్భుతమైన సన్నివేశాన్ని చూడవచ్చు. ఇది కేవలం ఒక కథ కాదు, మన జీవితాలను మార్చే ఒక గొప్ప సందేశం.

యేసు గెన్నెసరెతు సరస్సు ఒడ్డున నిలబడి ఉన్నాడు. ప్రజలు ఆయన బోధనలు వినడానికి గుంపుగా చేరారు. ఆయన దేవుని వాక్యాన్ని బోధిస్తున్నాడు. ఆ సమయంలో ఆయన రెండు పడవలను చూశాడు. అవి ఒడ్డున ఉన్నాయి. జాలర్లు వాటిలో నుండి దిగి తమ వలలు కడుగుతున్నారు. పేతురు యొక్క పడవను ఆయన ఎక్కి, ఒడ్డు నుండి కొంచెం దూరంగా దానిని నడపమని అడిగాడు. తరువాత ఆయన కూర్చుని ఆ పడవ నుండి ప్రజలకు బోధించాడు.

యేసు బోధన ముగిసిన తరువాత, సీమోనుతో (పేతురు) "దూరంగా వెళ్ళి చేపలు పట్టడానికి మీ వలలు వేయండి" అని చెప్పాడు. సీమోను ఆయనతో, "ఏలినవాడా, మేము రాత్రంతా కష్ట పడ్డాము, కాని ఏమీ దొరకలేదు. అయినప్పటికీ నీ మాట ప్రకారం వల వేస్తాను" అన్నాడు. వారు అలా చేసినప్పుడు, వారు పెద్ద మొత్తంలో చేపల ను పట్టుకున్నారు, వారి వలలు చిరిగి పోయేలా ఉన్నాయి. వారు తమ సహోదరులకు సహాయం చేయమని సంజ్ఞ చేసారు, వారు వచ్చి రెండు పడవల ను నింపారు. అవి మునిగిపోయేంతగా నిండాయి.

సీమోను పేతురు ఇది చూసినప్పుడు, యేసు పాదాల వద్ద పడి, "ప్రభువా, నేను పాపిని, నన్ను విడిచి వెళ్ళండి" అన్నాడు. పేతురు, అతనితో ఉన్న వారందరూ వారు పట్టుకున్న చేపల సమూహానికి ఆశ్చర్యపోయారు. యాకోబు, యోహాను కూడా ఆశ్చర్యపోయారు. యేసు సీమోనుతో, "భయపడకు; ఇకనుండి నువ్వు మనుష్యులను పట్టుకునే జాలరివి అవుతావు" అని చెప్పాడు. అప్పుడు వారు పడవలను ఒడ్డుకు చేర్చి, అన్నింటినీ విడిచిపెట్టి ఆయనను వెంబడించారు.

### పరిశీలన ప్రశ్నలు

1. ఈ భాగంలో ఉన్న వ్యక్తులు ఎవరు?
2. ఈ సంఘటన ఎక్కడ జరిగింది?
3. ఈ కథ యొక్క ప్రధాన విషయం ఏమిటి?

### విశ్లేషణ ప్రశ్నలు


1. జనసమూహం యేసుక్రీస్తు ప్రభువుల మాటలు వినడానికి ఎందుకు అంత ఆసక్తి చూపించింది?
2. రాత్రంతా కష్టపడినా, పేతురు చేపలు పట్టలేకపోయాడు. ఇలాంటి పరిస్థితిలో అతని శారీరక మరియు మానసిక స్థితి ఎలా ఉండొచ్చు?
3. యేసుక్రీస్తు ప్రభువు పేతురును మరొకసారి వల వేయమని అడిగినప్పుడు, పేతురు తన మనసులో ఏమి ఆలోచించగలడు?
4. పేతురు విస్తారమైన చేపలు పట్టడానికి గల కారణం ఏమిటి?
5. చేపలు పడకమునుపు పేతురు యేసు పట్ల ఎలా ఉన్నాడు? చేపలు పడిన తరువాత అతని వైఖరి ఎలా మారింది?
6. యేసుక్రీస్తు పేతురును ప్రత్యేకంగా సంధించాడని ఎలా చెప్పగలం?
7. పేతురు తనలోని ఏ పాపాన్ని గ్రహించి యేసు క్రీస్తును దూరంగా ఉండమని చెప్పాడు?
8. యేసుక్రీస్తును వెంబడించుటలో పేతురు ఏమి విడిచి పెట్టాడు? దానిలో మనకు ఏమి అర్థమవుతుంది?

### అనువర్తన ప్రశ్నలు

1. యేసుక్రీస్తు పేతురును ప్రభావితం చేసిన విధంగా, నిన్ను ప్రభావితం చేసిన సందర్భాల ను గుర్తు చేసుకోండి.
2. యేసుక్రీస్తు ప్రభువు నిన్ను రక్షించడంలో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ ఏమిటో ఒకసారి గ్రహించండి.
3. క్రీస్తును పరిపూర్ణంగా వెంబడించడానికి నీకు ఉన్న అడ్డంకులు ఏమిటి? వాటిని గుర్తించి, విడిచిపెట్టండి.

– నాగేశ్వరరావు, స్టాఫ్
ఖమ్మం

# మార్చి‘25 యెహెజ్కేలు గ్రంథము (1- 2 అధ్యాయాలు)




**అడ్డం**

1. ఆయన నాతో మాటలాడినప్పుడు నా లోనికి ఏమి వచ్చి నన్ను నిలువబెట్టెను?
3. వాటి రెక్కల చప్పుడు విన్నపుడు ఏ దేవుని స్వరము వలె ఉండెను?
5. వాటి తలల పైనున్న ఆకాశ మండలము పైన ఎటువంటి సింహాసనము కనబడెను?
7. నడుము మొదలుకొని మీదికిని దిగువకు ఎటువంటి స్వరూపమువలె కనబడెను?
8. వారు వినినను వినకపోయినను తమ మధ్య ఎవరు వున్నాడని వారు తెలిసి కొనునట్లు వారికి ప్రకటింపవలెను?

**నిలువు**

1. జీవుల తలలపైన ఎటువంటి విశాలత వున్నట్టు ఉండెను?
2. నాలుగు జీవులు ఒక్కొక్క దానికి ఎన్ని ముఖములు కలవు?
4. నాలుగు జీవుల రూపములు ఎటువంటి స్వరూపము వలే వున్నవి?
6. ఆ గ్రంథమును విప్పగా అందులో లోపటను వెలుపటను ఎటువంటి దు:ఖము అని వ్రాయబడియుండెను?
7. యెహోయాకీను చెరపట్టబడిన ఏ సంవత్సరమున యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమాయెను?

– కె.కిరణ్ కుమార్,
స్టాఫ్, మహబూబ్‌నగర్

* * * * * *

**ఫిబ్రవరి ‘25**
**హగ్గయి గ్రంథము**
**(1- 2 అధ్యాయాలు)**

**అడ్డం**
4. అన్యజనులందరిని
6. రెండవ
8. సరంబి వేసిన
9. భయభక్తులు పూనిరి
10. ఏడవ
11. వెండి బంగారాలు

**నిలువు**
1. తొమ్మిదవ
2. దేవుని మందిరం
3. మ్రాను
4. అపవిత్రముగా
5. ప్రవర్తన
7. భయపడకుడి
8. సమయమింకా రాలేదు

**విజేతలు:**
1. జ్యోతి గంగారాం, కొంపల్లి
2. శ్రీలత బాలాజీ, స్టాఫ్ సైనిక్‌పురి




# ఆత్మీయ ఎదురీత

చుట్టూ ఉంది లోక సముద్రం!
గమ్యం తెలియని జీవులన్నీ
అక్కడికక్కడే ఈదుతూ ఉన్నాయి

లోక ప్రవాహం
దినదినమూ పెరుగుతోంది
బలహీనమైనవి భయపడుతున్నాయి
చచ్చినవి ప్రవాహంతో కొట్టుకుపోతున్నాయి

రక్షణ పొందిన ప్రతి జీవికీ
ఉన్నది ఒక్కటే మార్గం!
జీవిత గమ్యం చేరాలంటే
లోకానికి ఎదురీదాలి!

మధ్య మధ్యలో పరీక్షలు పెట్టినట్లు
ఆటుపోట్లు అలలెత్తుతూ ఉంటాయి
శ్రమల తుఫాన్లు వడిగా వీస్తుంటాయి
విమర్శల వరదలు పొంగి ప్రవహిస్తుంటాయి
శోధన సుడిగుండాలు చుట్టుముడుతూ ఉంటాయి

ఇక్కడ ధ్యేయం
జీవిత పరీక్షల్లో పాసవడమే!
రెట్టింపు ఉత్సాహంతో ఎదురీదడమే!



ఎదుర్కొనే ప్రతీ పరీక్ష
పడగొట్టడానికి కాదు
మరో మెట్టులో నిలబెట్టడానికి!

పాసయిన హృదయం
మరో ఉన్నత స్థాయికి చేరుకోవాలి
ఫెయిలైన హృదయం
పాఠాల్ని నేర్చుకుంటూ
మళ్ళీ కొనసాగిపోవాలి

నడి సముద్రంలో ముంచేసే
లోక తత్త్వ జ్ఞాన జ్ఞానాలు
మెలిపెట్టే సిద్ధాంతాలు
ఎదురవుతూనే ఉంటాయి
వాటిని జ్ఞానంతో తిరస్కరించాలి

సత్య వేద సారమే
గమ్యాన్ని చేరుస్తుంది!
క్రీస్తులో మార్పు చెందిన మనసే
లోకానికి ఎదురీదుతుంది!

- ఎస్.ఈశ్వర్ (ఆర్కిటెక్ట్)
మెహదీపట్నం జోన్

UESI PUBLICATIONS Since 1988

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)